'సోమశిల'లో 60 టీఎంసీల నీరు

అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 60.594 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి మంగళవారం 18,947 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● 'రాళ్లపాడు'లో 17 అడుగులు..

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 17 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి 475 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది.

అక్రమాలకు అడ్డాగా నిలిచిన జగనన్న లేఅవుట్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని విజిలెన్స్ విభాగం తేల్చేసింది. పేదల ఇళ్ల మాటున ప్రజాధనాన్ని దిగమింగిన భోక్తల వివరాలనూ వెల్లడించింది. జిల్లావ్యాప్తంగా రూ.వంద కోట్ల వరకు అవినీతి జరిగిందని తేల్చిన అధికారులు వెంటనే బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. అలాగే దిగమింగిన నిధులనూ కక్కించాలని సూచించింది. మరి క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న చర్చ విస్తృతంగా నడుస్తోంది.



గృహ నిర్మాణంలో రూ.100 కోట్లు మెక్కేశారు!

పంచాయతీరాజ్‌కు విజిలెన్స్ నివేదిక

నిర్మాణాలకు అదనంగా బిల్లులిచ్చారు!

సిమెంటు, స్టీలులోనూ అక్రమాలు

ఏఈల నుంచి వివరణ తీసుకోండి

బొక్కిన నిధులూ కక్కించండి!



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలోని జగనన్న లేఅవుట్లలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఇళ్ల నిర్మాణాల్లో పెద్దఎత్తున అక్రమాలు, అవినీతి జరిగినట్లు లెక్కలు తేల్చారు. ఇళ్ల నిర్మాణాలు ఎన్ని జరిగాయి. ఏ స్థాయిలో ఉన్నాయి? బిల్లులు ఎంత మంజూరు చేశారు? సిమెంటు, స్టీలు వాడకం జరిగిందా? వాటిలో అక్రమాలు ఏ మేరకు జరిగాయి తదితర అంశాలపై విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే, దాదాపు అనేక లే అవుట్లలో అవినీతి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నిర్మాణాలకంటే అధికంగా బిల్లులు ఇచ్చి ఉన్నారని సిమెంటు, స్టీలు వినియోగించకుండా బయట విక్రయించారని విచారణలో తేల్చారు. దాదాపు రూ.100 కోట్ల మేర



కావలి : ముసునూరు మెగా లేఅవుట్లో అర్ధంతరంగా ఆగిన ఇళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

- మిగతా 6లో



లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారుల బృందం

ఆ బ్రాండ్ ఏమిటి..
అమ్మినదెంత!?

● ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ విస్తృత తనిఖీలు

● ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఫైళ్ల పరిశీలన

వెంకటాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'ఆ బ్రాండ్ పేరేమిటి?. ఎన్ని కేసులు అమ్మారు? విక్రయ లావాదేవీలు ఎంత!?' ఇలా అనేక కోణాల్లో ఎస్ఎన్‌జే (ఎస్ఎన్.జయమురగన్) లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ బృందం ఆరా తీసింది. వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారుల బృందం విస్తృత సోదాలు నిర్వహించింది. సీఐడీ డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలోకి ప్రవేశించింది. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మద్యాన్ని ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీ నుంచే సరఫరా అయ్యింది. అప్పట్లో మద్యం అమ్మకాలు, నాసిరకమైన మద్యం బ్రాండ్ల సరఫరాపై సీఐడీ బృందం ఈ తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. రికార్డుల గదిలో ఉన్న ప్రతి ఫైలునూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రయినా తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే అప్పట్లో సరఫరా చేసిన బ్రాండ్లకు సంబంధించిన మద్యం శాంపిళ్లను సైతం అధికారులు సేకరించినట్లు సమాచారం. సీఐడీ తనిఖీలు జరుగుతుండటంతో ఫ్యాక్టరీలోకి మీడియాను సైతం అనుమతించలేదు.

స్కూల్ గ్రాంట్స్ నిధుల విడుదల

● జిల్లాకు రూ.6 కోట్ల కేటాయింపు

నెల్లూరు (విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్స్ నిధులను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పీఎం శ్రీ స్కూల్స్, కేజీబీవీలకు, జూనియర్ కళాశాలలకు కలిపి 2,498 విద్యాసంస్థలకు రూ.6 కోట్లు కేటాయిస్తూ తొలి విడతగా 50 శాతం నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులను సంబంధింత పాఠశాలలకు తక్షణమే విడుదల చేసి వివరాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అలాగే టైప్-2 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో అదనపు తరగతిగదులు, లేబొరేటరీలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదులు, ప్రహరీల నిర్మాణం తదితర సివిల్ పనుల కోసం, మేజర్ రిపేర్ల కోసం నిధులు ఖర్చు చేయాలని, అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి నివేదికలను తనకు అందచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అవన్నీ ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం కండలేరు ప్రాజెక్టు అవసరాలకు తీసుకున్న భూములు. అప్పట్లో డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టా భూముల మాదిరిగా పరిహారం ఇచ్చే నిబంధనలు లేవు. నాడు ఎక్స్‌గ్రేషియా మాత్రమే చెల్లించి ఆ భూములను కండలేరు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు.. అయితే అటువంటి భూములన్నిటికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలుగుగంగ భూసేకరణ కార్యాలయంలో దస్త్రాలు కదులుతున్నాయి. ఒకసారి రిక్విజిషన్ ఇచ్చాక మళ్లీ ఇంజనీరింగ్ అధికారులు ఎలా కొత్తగా రిక్విజిషన్ ఇస్తారు? మూడు దశాబ్దాల క్రితం ప్రాజెక్టుకు అప్పగించిన భూములకు ఇప్పుడెలా కొత్త చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తారు? ఈ లెక్కన కండేలేరు ముంపులోని భూములకు, రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టుల కింద తీసుకున్న వేల ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు ఎన్ని రూ.వేల కోట్లు పరిహారం ఇవ్వాలి? అన్న ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఇదేం వింత సామీ!

ఎప్పుడో తీసుకున్న భూములకు ఇప్పుడు పరిహారమట!

కండలేరు ముంపు పేరిట మళ్లీ కదులుతున్న దస్త్రాలు

డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పరిహారం కోసం నోటిఫికేషన్


కొత్త చట్టం ప్రకారం ఇచ్చేందుకు ఎత్తుగడలు

రంగంలోకి దిగిన దళారులు.. బాధితుల పేరిట దోచుకునే కుట్ర

కండలేరు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి మూడు దశాబ్దాలు గడిచినా ఇంకా పరిహారం చెల్లింపు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఈ వ్యవహారం వెనుక ఇప్పటికే అనేక అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ) భూసేకరణ విభాగాన్ని మూసివేయాలని గత కలెక్టర్ చక్రధర్‌బాబు ఏకంగా ప్రభుత్వానికి సిఫారసు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తాజాగా మరో భూ పంపిణీ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాపూరు మండలం గుండవోలు గ్రామానికి సంబంధించి డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పరిహారం ఇచ్చేందుకు ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో పేర్కొన్న సర్వే నెంబర్లలోని భూముల వివరాలను చూశాక అనేక ఫిర్యాదులు జిల్లా ఉన్నతాధికారులకు అందుతున్నాయి. ముంపు పరిహారం మాటున మళ్లీ ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు దళారులు రంగంలోకి దిగారని, ఆ క్రమంలోనే నోటిఫికేషన్ విడుదల చేశారంటూ కొందరు ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

● నాడు అప్పగించి నేడు పరిహారమట

గుండవోలులో సుమారు వంద ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.6.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు టీజీపీ భూసేకరణ అధికారులు రెండు వారాల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో పేర్కొన్న అనేక సర్వే నెంబర్లలోని భూమిని గతంలోనే కండలేరు ప్రాజెక్టుకు అప్పగించినట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్ని సర్వే నెంబర్లలోని భూమికి సంబంధించి గతంలోనే ఇంజనీరింగ్ అధికారులు రిక్విజిషన్‌లు పంపినట్లు స్పష్టమవుతోంది. అయినా ఇప్పుడు మళ్లీ పరిహారం చెల్లించేందుకు సిద్ధమవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. 2013కు ముందు వరకూ డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టా భూముల మాదిరి పరిహారం చెల్లించేవారు కాదు. అవి ప్రభుత్వ భూములు కాబట్టి ఎక్స్‌గ్రేషియా మాత్రమే ఇచ్చేవారు. కండలేరు ప్రాజెక్టు కోసం వేల ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములను సేకరించారు. వీరందరికీ అప్పట్లోనే ఎక్స్‌గ్రేషియా చెల్లించినట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



గత నెలలో ఈఈ ఇచ్చిన రిమార్కులతో కూడిన రిక్విజిషన్

● కొత్త రిక్విజిషన్ ఎలా సాధ్యం?

ఏదైనా ప్రాజెక్టు నిర్మించే సమయంలోనే అందుకు అవసరమైన భూమికి సంబంధించి ఇరిగేషన్

- మిగతా 6లో

ఆయకట్టు ఓటరు జాబితా
31లోగా సిద్ధం చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయకట్టు ఓటర్ల జాబితా 31లోగా సిద్ధం చేయాలనికలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఉపాధి హామీ పనిదినాల పెంపు, హౌసింగ్ తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని, 70వేల పనిదినాల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని సూచించారు. పంచాయతీల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, అదేవిధంగా ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీలు, మున్సిపాలిటీ లు, కార్పొరేషన్లలో పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్సును జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, డీఆర్వో లవన్న, డీఎం హెచ్‌ఓ పెంచలయ్య జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ దయాకర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను
ప్రజల్లోకి తీసుకెళ్లండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : పేదల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి బీమా యోజన, జీవనజ్యోతి వంటి బీమా పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో బ్యాంకర్ల జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీమా పథకాలపై వచ్చే ఏడాది జనవరి 15 వరకు గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు ఉంటాయన్నారు.

● భూసేరణ పూర్తి చేయండి

జిల్లాలో ఎన్‌హెచ్ఏఐ, రైల్వే, ఆర్ఓబీలు, ఆర్ అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. భూ సేకరణపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం జేసీ సమీక్షించారు. కొన్నిచోట్ల మ్యూటేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయని, దానిని పూర్తి చేసి సంబంధిత ప్రాజెక్టుల వారికి పూర్తిస్థాయిలో అందచేస్తామన్నారు.



ఆటోలో విత్తనాలను తీసుకెళుతున్న ఆటో

నకిలీలతో వర్రీ!

● అల్లూరులో పుట్టగొడుగుల్లా వరి విత్తన విక్రయ కేంద్రాలు

● ప్రాసెసింగ్ లేకుండానే రైతులకు అంటగడుతున్న వైనం

● రూ.20 కోట్ల పైచిలుకు వ్యాపార లావాదేవీలు

● ముడుపుల మత్తులో అధికారులు..

● తెరవెనుక రాజకీయ నేతల అండ?

అల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజోతి) : నకిలీ వరి విత్తనాలకు నిలయంగా అల్లూరు మారిపోతోంది. దాదాపు 40 మందికిపైగా భారీస్థాయిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. వరి విత్తన వ్యాపారుల్లో మండలంలో నలుగురికి మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయితే, ఎటువంటి అనుమతులు లేకుండానే వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విత్తనాల పేరుతో రైతులకు అంటగడుతు న్నారు. అల్లూరు మండలంలో దాదాపుగా 40 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా, 10 లక్షల కిలోల విత్తనాలు అవసరవుతాయి. బయటి ప్రాంతాల నుంచి కూడా ఎంతో మంది రైతులు అల్లూరుకు వచ్చి విత్తనాలు తీసుకెళుతుంటారు. ఇలా దాదాపు 30 లక్షల కిలోలు విత్తనాలను విక్రయిస్తుండగా, సుమారు రూ.15 కోట్ల పైబడి లావాదేవీలు జరుగుతున్నాయి.

● పర్యవేక్షణ అంతంతే!

వరి విత్తన విక్రయ కేంద్రం, విత్తన తయారీ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి. అందులోనూ కేటగిరీని బట్టి విత్తనాలు పరిమితంగానే విక్రయించాల్సి ఉంది. అనుమతి రుసుము, సెస్, ఆదాయపు పన్ను తదితర వాటితో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అయితే, నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యాపారాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పర్యవేక్షణ మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఇక రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు వ్యాపారులు ఎటువంటి బిల్లులు ఇవ్వడం లేదు. కనీసం తాము చెల్లించిన మొత్తానికి రశీదు పొందాల్సిన రైతులు ఆ దృష్టితో ఆలోచించే పరిస్థితి లేదు.

● నామమాత్రపు దాడులు

ఇటీవల అల్లూరు మండలంలో మూడు విత్తన తయారీ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. అల్లూరు, ఇస్కపల్లి, నార్తుమోపూరులలో ఎంతో మంది వ్యాపారులు భారీస్థా యిలో విత్తనాలు విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నా వ్యవసాయశాఖాధికారులు వద్ద ఉన్నా కేవలం మూడు కేంద్రాలపైనే దాడులు చేయడం విమర్శలకు తావిస్తోంది.

● రాజకీయ, అధికార అండదండలు

నకిలీ విత్తన విక్రయాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు తమకు ముడుపులు అందితే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయ అధికారులు, రాజకీయ ప్రతినిధులే వ్యాపారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అధికారులకు

- వివరాలు 6లో..



శిథిలభవనంలో బిక్కు బిక్కుమంటూ..

ఇది లింగసముద్రంలోని బీసీ బాలుర వసతి గృహం. వారం రోజుల కిందట కురిసిన వర్షాలకు వసతిగృహ భవనం గదుల గోడలు, స్లాబు పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఈ సమస్యతో విద్యార్థులు భయంతో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మంగళవారం కూడా కొన్ని



పెచ్చులూడి కింద పడటంతో కొందరు విద్యార్థులు భయంతో ఇళ్లకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కె.శ్రీనివాసులు వసతిగృహానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. సచివాలయం-1కి చెందిన ఖాళీగా ఉన్న రైతు సేవా కేంద్రం భవనంలో మార్పు చేశారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)





నింగినేల కలిసినట్టు!

పుడమిపై పచ్చని చెట్లు.. మబ్బులు కమ్మిన ఆకాశం ఈ రెండూ కలిసిపోయిన సుందర దృశ్యాలు నెల్లూరు రూరల్ మండలం వేదగిరి నృసింహ కొండపై అబ్బుర పరిచాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఆకులపై 'అద్భుతాలు'

లీఫ్స్‌పై 300లకుపైగా చిత్రాలు
ఎన్నో అవార్డులు, మరెన్నో ప్రశంసలు
విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య



ఆయన కుంచె కదిపితే ప్రకృతి పులకరిస్తుంది. సెలయేళ్లు పరవళ్లు తొక్కుతాయి.. మేఘాలు వర్షిస్తాయి.. నెమలి పురివిప్పి నాట్యం చేస్తుంది.. పడుచుపిల్లలు ఊహల పల్లకీలో విహరిస్తారు. దేవతామూర్తులు ప్రత్యక్షమై ఆశీర్వదిస్తారు. ఇలా ఆ కుంచె ఎన్నో అద్భుత చిత్రాలను సృష్టించింది. మనసులోని భావాలను అందంగా మనసుకు నచ్చేలా హృదయానికి హత్తుకునేలా వివరించే శక్తి ఒక్క కళకే ఉంటుంది. ముఖ్యంగా ఆకులపై (రావి, కుంకుడు, ఇరికి, కానుగ) భిన్న రంగులతో కళాకారులు చేసే మ్యాజిక్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఇలా దాదాపు 300లకు పైగా అద్భుతమైన చిత్రాలు గీశారు పొదలకూరు మండలానికి చెందిన పచ్చా పెంచలయ్య.





పొదలకూరు మండలంలోని మహమ్మదాపురం హరిజనవాడలో 1951లో పెంచలదాసు, నరసమ్మ దంపతుల ఏకైక కుమారుడు పచ్చా పెంచలయ్య. అదే గ్రామంలో డీఎస్ఆర్ హైస్కూల్లో అప్పట్లో హయ్యర్ సెకండరీ చదివారు. తర్వాత ఆనాటి స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ కొమ్మూరి జీవరత్నం మాస్టర్ ప్రోత్సాహంతో మద్రాసులోని కమిషనర్ ఆఫ్ గవర్నమెంటు టెక్నికల్ ఎగ్జామినేషన్‌లో డ్రాయింగ్ విభాగంలో లోయర్, హయ్యర్ పూర్తి చేసి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత టీటీసీ పూర్తి చేసి 1971లో డ్రాయింగ్ మాస్టర్‌గా ఏఎస్‌పేటలో చేరారు. రూ.126 జీతంతో తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి 38 ఏళ్లపాటు డ్రాయింగ్ మాస్టర్‌గా వివిధ పాఠశాలల్లో పనిచేసి, తాను విద్య నేర్చుకున్న మహమ్మదాపురం పాఠశాలలోనే అత్యధిక కాలం పనిచేసి అక్కడే రిటైర్డ్ అయ్యారు. ఏ చిత్రాన్నైనా ఉన్నది ఉన్నట్లుగా చూసిన వెంటనే గీయగలిగిన సమర్థుడు పెంచలయ్య సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆర్ట్ క్రాఫ్ట్‌కు సంబంధించి ప్రత్యేక విభాగంలో కావలి, విడవలూరు, గూడూరు, అలాగే ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ తెనాలి, భీమవరం, కాకినాడలో పలు అవార్డులను ప్రశంసలను అందుకున్నారు. అలాగే మైక్రో ఆర్ట్‌లో 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు బియ్యపు గింజపై పార్టీ గుర్తును పంపగా ఆయన అభినందనలతో ఒక ప్రత్యేక లేఖను పెంచలయ్యకు పంపారు. అలాగే పెంచలయ్య కేవలం చిత్రకారుడే కాకుండా తెలుగుపై పట్టు ఉన్న కవిగా చెప్పుకోవచ్చు. 2012లో పెంచలయ్య శ్రీనృసింహ శతకం అనే పేరుతో శతకం రాశారు. ఈ శతకాన్ని హైదరాబాదు శ్రీ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వారు కవులను ప్రోత్సహించుటలో భాగంగా అచ్చువేసి, పచ్చా పెంచలయ్యకు 20 కాపీలను అందించారు. విజయవాడ ఆల్ ఇండియా రేడియో నిర్వాహకులు ప్రతి వారం సమస్యా -పూరణాలు అనే పద్యపాదాలకు సమాధానాలు ఇస్తూ ఉంటారు. సింహపురి రేడియోలో సూక్తి - సుధా కార్యక్రమానికి ఆయన సూక్తులు, వ్యాఖ్యానం అందిస్తుంటారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)



రావి ఆకుపై శ్రీకృష్ణుడు



రావి ఆకుపై భరతమాత



రావి ఆకుపై ప్రధానమంత్రి మోడీ



సమీక్షలో మాట్లాడుతున్న పెంచలయ్య

హైరిస్క్ గర్భిణులకు తక్షణ చికిత్సలు అందించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి వెంటనే వైద్య చికిత్సలు సంపూర్ణంగా అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో మాతా,శిశు మరణాల సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన మాతా, శిశు మరణాలపై సమీక్ష జరిపారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులకు తగిన పరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రక్తహీనత వల్ల తల్లీబిడ్డ మరణాలు సంభవిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

దానా తుఫాన్ కారణంగా
పలు రైళ్లు రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో దానా తుపాను కారణంగా 23, 24 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన కామాఖ్య - ఎస్ఎంబిటి బెంగళూరు, సిల్‌చార్ - సికింద్రాబాద్, డిబ్రూగర్ - కన్యాకుమారి, సికింద్రబాద్ - భువనేశ్వర్, చెన్నై సెంట్రల్ - హౌరా, పుదుచ్చేరి - హౌరా, చెన్నై - షాలిమార్, పుదుచ్చేరి - భువనేశ్వర్, కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్, సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్, ఎస్ఎంబిటి బెంగళూరు - గౌహతి, హైదరాబాద్ - హౌరా, కన్యాకుమారి - డిబ్రూగర్, సికింద్రాబాద్ - హౌరా, ఎస్ఎంబిటి బెంగళూరు - హౌరా, సికింద్రాబాద్ - మాల్దా టౌన్, యశ్వంతపూర్ - హౌరా, తిరున్వేలి - షాలిమార్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 24వ తేదీన పూరీ - తిరుపతి, హౌరా - సికింద్రాబాద్, ఖర్గపూర్ - విల్లుపురం, హౌరా - భువనేశ్వర్, షాలిమార్ - చెన్నై సెంటర్, సత్రాగచ్చి - మంగళూరు సెంటర్, హౌరా - తిరుచురాపల్లి, హౌరా - ఎస్ఎంబిటి బెంగళూరు, షాలిమార్ - వాస్కోడగామ, హౌరా - చెన్నై సెంట్రల్, పాట్నా - ఎర్నాకులం, సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ రైళ్లను రద్దు చేశారు.

కేజీబీవీ పోస్టులకు ముగిసిన
సర్టిఫికెట్ల పరిశీలన

- 31 పోస్టులకు 355 మంది హాజరు

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఉద్యోగాలకు అభ్యర్థులు పోటెత్తారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో ఉన్న పీజీటీలు 16, సీఆర్‌టీలు 7, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 కలిపి మొత్తం 31 పోస్టులను ఒప్పంద, పొరుగుసేవల ప్రాతిపదిన ఏడాది పాటు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్య ర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. 498 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారంతో ముగిసింది. 30 టీచింగ్ పోస్టులకు 422 మంది దరఖాస్తు చేసుకోగా 298 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. మొత్తంగా 355 మంది సర్టిఫికెట్ల పరి శీలనకు హాజరైనట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఎనిమిది మంది సీనియర్ గెజిటెడ్ హోదా కలిగిన ప్రధానోపాధ్యాయులను నియమించామని పేర్కొన్నారు. మెరిట్ ఆధా రంగా జాబితా సిద్ధం చేస్తున్నామని, జాబితాపై అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయంలో నియామకాలు చేపడతారని తెలిపారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



వేణుగోపాలుడి పవిత్రోత్సవం

నెల్లూరులోని మూలాపేటలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి గోపురోత్సవం నయనానందకరంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, నిత్యహోమం, పూర్ణాహుతి జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్, ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

నకిలీలతో వర్రీ!

(5వ పేజీ తరువాయి)

ముడుపులు చెల్లించడం ఆలస్యమైనందువల్లే విజిలెన్స్ దాడులు జరిగాయని ఒకరు, తన వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉన్నారని మరికొందరు బహిరంగంగానే చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ విత్తన వ్యాపారులపై నిక్కచ్చిగా వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు ఎందుకు తీసుకోరు!



ఎటువంటి అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ వ్యాపారులు రూ.కోట్లు గడిస్తున్నారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. అధికారులకు సమాచారం అందించినా ప్రజాప్రతినిధుల వల్ల తామేమీ చేయలేమని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరం.

- నిరంజన్‌రెడ్డి, రైతు, నార్తుమోపూరు, అల్లూరు మండలం

రూ.20 కోట్లపైనే విత్తన వ్యాపారాలు



ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి ఎంతోమంది రైతులు అల్లూరులోని పలువురు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. రూ.20 కోట్ల పైబడి లావాదేవీలు జరుపుతున్న వ్యాపారుల్లో ఒకరికో, ఇద్దరికో మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. నకిలీ విత్తనాలతో రైతుల నష్టపోతే మంచి పేరున్న అల్లూరు అక్రమాల నిలయంగా మారే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దశరథరామిరెడ్డి, నార్తుమోపూరు, అల్లూరు మండలం

వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే తప్పులు

- సోమిరెడ్డి ఎదుట హౌసింగ్ ఇంజనీర్ల ఆవేదన
- అక్రమార్కుల వివరాలివ్వండి : సోమిరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల తీవ్ర ఒత్తిళ్లతోనే నాడు పేదల ఇళ్ల నిర్మాణాల్లో తప్పులు జరిగాయి. అక్రమాలు జరుగుతున్నాయని తెలిసినా ఏమీ చేయలేక పోయాం. ఆ రోజే తిరుగుబాటు చేసి ఉంటే మాకు ఈ దుస్థితి దాపురించేది కాదు. విజిలెన్స్ విచారణ నుంచి మమ్మల్ని కాపాడండి' అంటూ హౌసింగ్ ఇంజనీర్లు, ఉద్యోగులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎదుట వాపోయారు. జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాల మాటున వైసీపీ ప్రభుత్వంలో భారీ అక్రమాలు జరిగాయి. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు. నాసిరకంగా నిర్మించిన ఇళ్లపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, ప్రస్తుతం ఆ విచారణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే అనేక లేఅవుట్లలో నాసిరకంగా నిర్మాణాలు చేసినట్లు గుర్తించారు.



హౌసింగ్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

దీంతో హౌసింగ్ అధికారులు, ఉద్యోగుల్లో భయం పట్టుకుంది. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సంఖ్యలో నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయానికి తరలివచ్చారు. ఆయన ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విజిలెన్స్ విచారణలో ఇప్పటికే రూ.120 కోట్లకుపైగా అవినీతి వెలుగులోకి వచ్చిందని, నెల్లూరు, కావలి మెగా లేఅవుట్లలోనే రూ.45 కోట్ల అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయిందని వ్యాఖ్యానించారు. ఎవరి ప్రోద్బలంతో అక్రమాలను చూసీచూడనట్లుగా ఊరుకున్నారో, వారి వివరాలు వెల్లడించాలని హౌసింగ్ ఉద్యోగులకు సోమిరెడ్డి సూచించారు.

రూ.100 కోట్లు
మెక్కేశారు!

(5వ పేజీ తరువాయి)

అవినీతి అక్రమాలు జరిగినట్లు నివేదికను సిద్ధం చేశారు. దీంతో ఆయా లేఅవుట్ల పరిధిలో విధులు నిర్వహించి, గృహ నిర్మాణాలు పర్యవేక్షించిన అసిస్టెంట్ ఇంజనీర్లకు నోటీసులు జారీ చేసి రాత పూర్వక వివరణ తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈకి విజిలెన్స్‌శాఖ సూచించింది. లే అవుట్ల వారీగా అక్రమాలు ఎంత జరిగాయో ఆ మేరకు రికవరీ చేయాలన్న వివరాలను ఎస్ఈకి అందజేశారు. దీనికి అనుగుణంగా ఇంజనీరు అసిస్టెంట్ల నుంచి వివరణ తీసుకుని బాధ్యులైన ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ శాఖ సూచించింది.

బిర్యానీ ఎలా ఉంది!?

- నగరంలో ఫుడ్‌కంట్రోల్ అధికారుల తనిఖీలు

నెల్లూరు(సిటీ),అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : కమ్మని బిర్యానీ తయారీ వెనుకున్న ఆందోళనకర వాస్తవాలను పరిశోధనాత్మకంగా ఆంధ్రజ్యోతి ఆదివారం వెలుగులోకి తెచ్చింది. దీనిపై సమగ్ర వాస్తవాలు సమీకరించిన ఆహార భద్రత, కార్పొరేషన్ అధికారులు బిర్యానీ తయారీ వంటశాలలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం సహాయ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఎన్ఎంసీకి చెందిన ఆరోగ్య అధికారి చైతన్య నేతృత్వంలోని బృందం నగరంలో రియాజ్ హోటల్‌పై ఆకస్మిక తనిఖీలు చేశారు. కనీస ప్రమాణాలు పాటించలేదని, కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గురించామని తెలిపారు. అలాగే చికెన్, మటన్ బిర్యానీలకు సంబంధించిన నమూనాలనూ ల్యాబ్‌కు పంపారు. కాగా, కార్పొరేషన్, ఎఫ్ఎస్‌వో అధికారుల దాడుల విషయం తెలుసుకున్న నగరంలోని ప్రముఖ హోటళ్ల యజమానులంతా అప్రమత్తమయ్యారు. ఇప్పటికే నగరంలోని గణేష్ మెస్‌కు నోటీసులు జారీ చేశామని ఎఫ్ఎస్‌వో అధికారులు తెలిపారు.

ఇదేం వింత సామీ!

(5వ పేజీ తరువాయి)

అధికారులు రిక్విజిషన్లు పంపుతారు. వాటి ఆధారంగా రెవెన్యూ వర్గాలు బాధితులకు పరిహారం చెల్లిస్తుంటాయి ఒకసారి రిక్విజిషన్ పంపాక మరోసారి పంపడానికి కుదరదు. గుండవోలు గ్రామానికి సంబంధించి రెండేళ్ల క్రితం కొత్తగా రిక్విజిషన్ పంపాలని ఇరిగేషన్ అధికారులకు లేఖలు అందినా ముప్పై ఏళ్ల క్రితం నాటి ప్రాజెక్టుకు నేడు రిక్విజిషన్ పంపడం వీలు కాదని, అప్పట్లోనే రిక్విజిషన్లు పంపారని నాటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సమాధానం ఇచ్చారు. అయితే తాజాగా గత నెలలో ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాత్రం కొత్త రిక్విజిషన్ పంపడం గమనార్హం. అయితే భూసేకరణ విభాగం అధికారులు పంపిన ప్రతీ సర్వే నంబర్ పక్కన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రిమార్కులు రాశారు. ఈ భూమిని గతంలోనే తమకు అప్పగించారని, మరికొంత భూమికి గతంలోనే రిక్విజిషన్లు పంపామని, తాజాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అడుగుతుండటంతోనే కొత్తగా రిక్విజిషన్ పంపుతున్నామని అందులో స్పష్టం చేశారు. 1992లోనే పలు సర్వే నంబర్లలోని భూములను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించినట్లు రికార్డులు కనిపిస్తున్నా.. ఆ భూములకు మళ్లీ కొత్తగా పరిహారం ఇచ్చేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం రికార్డులు పరిశీలిస్తే ఇటువంటి ఇంకెన్ని ఉంటాయోనన్న అనుమానం కలుగుతోంది. అయితే ఈ రికార్డులు చాలా వరకూ మాయమైనట్లు తెలుస్తోంది. టీజీపీలో అల్ప సంపాదనకు అలవాటు పడిన కొందరు దళారులు ఇప్పుడు కూడా ముంపు బాధితులకు డబ్బులు ఆశ చూపి 50 శాతం డీల్ కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో కొందరు టీజీపీ ఉద్యోగులు కూడా భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభ్యంతరాలుంటే చెప్పవచ్చు

గుండవోలు గ్రామంలోని డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు గతంలో పరిహారం చెల్లించలేదు కాబట్టే ఇప్పుడు చెల్లించేందుకు నోటిపికేషన్ ఇచ్చాం. గతంలో పరిహారం చెల్లించిన భూములు ఇందులో ఉన్నట్లు అభ్యంతరాలు ఉంటే మాకు తెలియజేయవచ్చు. వాటిని నోటిఫికేషన్ నుంచి తొలగిస్తాం. గుండవోలుకు సంబంధించి పరిహారం చెల్లింపు ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరుగుతోంది.

- ప్రేమ్‌కుమార్, టీజీపీ రాపూరు ఎస్‌డీసీ

నేర వార్తలు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు ఆక్వా రైతుల దుర్మరణం
- మృతులు తిరుపతి జిల్లా విద్యానగర్ వాసులు



మోటార్‌సైకిల్‌ను బస్సు ఢీకొనడంతో మృతి చెందిన సిద్ధారెడ్డి వెంకటరమణారెడ్డి

మనుబోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆక్వా రైతులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా కోట మండలం విద్యా నగర్‌కు చెందిన సిద్ధారెడ్డి వెంకటరమణారెడ్డి (61), పొనకా వెంకట సుబ్బారెడ్డి(60)లు స్నేహితులు. ఆక్వాసాగుతో పాటు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటుంటారు. ఈ క్రమంలో వెంకటరమ ణారెడ్డి కారు కొనుగోలు చేయాలని మోటార్ సైకిల్‌పై వెంకటసుబ్బారెడ్డిని తీసుకుని మంగళవారం నెల్లూరుకు వెళ్లారు. అక్కడ కార్లు చూసిన తరువాత మోటార్ సైకిల్‌పై గ్రామానికి తిరుగు ప్రయా ణమయ్యారు. బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి గూడూరు డిపోకు చెందిన కొల నుకు దురు పల్లె వెలుగు బస్సు కొలను కుదురు వెళ్లేం దుకు మలుపు తిప్పుతుండగా హఠాత్తుగా మోటా ర్‌సైకిల్ రావడంతో వేగాన్ని అదుపు చేయలేక మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనతో మోటార్‌సైకిల్ బస్సు కిందకు వెళ్లగా మోటార్‌సైకిల్ నడుపుతున్న వెంకటరమణారెడ్డి రోడ్డుపై పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదస్థలికి పది అడుగుల దూరంలో ఎగిరిపడ్డ వెంకటసుబ్బారెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ కారులో హుటాహుటిన గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది నిమిషాలకే మృతి చెందాడు. ప్రమాద సమయంలో పల్లెవెలుగు బస్సులో 19మంది తీరప్రాంతాల ప్రయాణికులు ఉన్నా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. దీంతో ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంతో నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

- ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చినా అర్ధగంట వరకు ప్రమాదస్థలికి చేరుకోలేదు. మండలానికి ఒక 108 ఉన్నా ఇలాంటి సమయాల్లో రావడం లేదంటూ స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రులు అర్ధగంట పాటు ప్రాణాలతో కొట్టుమిట్టాడరని, సకాలంలో వచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవని ప్రయాణికులు ఆవేదన చెందారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

- మృతుడు తెలంగాణలోని సూర్యపేట జిల్లావాసి



డ్రైవర్ మృతదేహం

కావలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వాయ పాలెం క్రాస్ రోడ్డు సమీపంలో సోమ వారం అర్ధరాత్రి ముందు వెళ్తున్న లారీని వెనుకనే వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సుందరి శ్రీనివాసరావు (53) మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం లోని సూర్యాపేట జిల్లా కరక్కాయల గూడెంకు చెందిన శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం నుండి లారీలో స్టీల్ బార్లతో చెన్నై వెళ్తుండగా మార్గమధ్యలో ముందు వెళ్తున్న లారీకి టైర్ పంక్చర్ అయ్యింది. ఈ ఘటనతో రోడ్డుపై ఒక్కసారిగా నిలడంతో వెనుకనే వస్తున్న లారీ ముందు లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐలు బాజిబాబు, తిరుమల రెడ్డి, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా క్రేన్‌తో లారీలను పక్కకు తొలగించారు. ఈ మేరకు ఎస్‌ఐ బాజిబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అల్లూరు శివాలయంలో చోరీ

- కామాక్షిదేవి మెడలోని తాళిబొట్టు, వెండికళ్లు చోరీ



వెండికళ్లు, తాళిబొట్టు తొలగించిన అమ్మవారు

అల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటలోని శివాలయం కామాక్షి దేవి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరి గింది. అమ్మవారి వెండికళ్లు, మెడలోని మంగళసూత్రాన్ని దొంగిలించారు. ముక్కుపుడకను దొంగిలించేందుకు ప్రయత్నించగా అది చేజారి అక్కడే పడిపోయింది. గ్రిల్స్‌కు ఉన్న తాళం, లోపల చెక్క తలుపు తాళం బద్దలు కొట్టి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన సమాచారం మేరకు మండల ఎస్‌ఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. అనంతరం క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలను సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పిన కారు : ముగ్గురికి స్వల్ప గాయాలు



పొలాల్లోకి దూసుకు వెళ్లిన కారు

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన సమీపంలో ముంబాయి జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసు కెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఉదయగిరికి చెందిన ఓ కుటుంబం కారులో నెల్లూరు వెళ్తుండగా మార్గమధ్యలో పెరమన క్రాస్ రోడ్డుకు రాగానే బ్రేక్ ఫెయిలయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకువెళ్లింది.దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయంపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి...

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడ్ హౌస్‌పేట క్రాస్ రోడ్డు కు సమీపంలో ముం బాయి జాతీయ రహదారిపై మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు ఢీకొన్నాయి. సంగం గ్రామానికి చెందిన నాగరాజు మోటారు బైక్‌పై బుచ్చి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటారు బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌లు నడుపుతున్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఆటోలో స్థానిక వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న ఎస్‌ఐ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7509
వెండి కిలో ధర	రూ. 100,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

ఎందుకంత గోప్యత!

అద్దె బస్సుల యజమానులతో ఈడీ సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులతో జోన్ ఈడీ వెంకటేశ్వరరావు మంగళవారం ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశంపై మీడియాకు సమాచారం లేకుండా గోప్యంగా నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అద్దె బస్సుల యజమానులతో మాటామంతి కలిపి ఆ తర్వాత బేరసారాలు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా అద్దె బస్సుల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రధానంగా సింగల్ డ్రైవర్లు ఉన్న హయర్ బస్సుల ప్రయాణికుల్లో అభద్రతా భావంగా నెలకొంటోందని పదే పదే అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో ఆయా బస్సుల యజమానులను పిలిపించి మీ సమస్యలు చెబితే పరిష్కరిస్తామంటూ సమావేశం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా, సమావేశానంతరం ఈడీ కార్యాలయం నుంచి కాకుండా ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ నుంచి వాట్సప్ ద్వారా మీడియాకు సమాచారం ఇవ్వడం గమనార్హం.



అద్దె బస్సుల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వరరావు

రోడ్డు వేశారు.. ఏం లాభం ?



వింజమూరు పట్టణంలోనూ, మండలంలోనూ సిమెంటు రోడ్లను ఇబ్బడిముబ్బడిగా వేశారు కానీ, డ్రైనేజీ కాలువలను నిర్మించలేదు. దీంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి చేరి రోడ్డు త్వరలా పగిలిపోతున్నదని ఆయా ప్రాంతాలవారు తెలిపారు. ముఖ్యంగా పట్టణంలోని బీసీ కాలనీ, సిద్ధార్థనగర్, అశోక్‌నగర్‌కాలనీల్లో సిమెంటు రోడ్లను వేసి, డ్రైనేజీ కాలువలను మర్చిపోయారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి సిమెంటు రోడ్డు వేయకుండా వదిలిపెట్టారు. సిమెంటు రోడ్లు మొదలు పెట్టేముందు, మొదట డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని గుర్తించాలని వారు కోరుతున్నారు.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)

వడివడిగా నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు

మెట్టలో రైలు కూత

- వేగవంతమైన భూసేకరణ
- రైతులతో చర్చించిన అధికారులు
- ప్రత్యేక దృష్టి సారించిన పాలకులు

ఏళ్ల తరబడి మెట్టప్రాంత ప్రజల కలగా ఉన్న రైలు ప్రయాణం త్వరలో సాకారం కానున్నది. వైసీపీ పాలనలో నత్తనడక సాగిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పనులు మళ్లీ వేగం పుంజుకుంటున్నాయి. జిల్లాలో సమస్యగా మారిన భూసేకరణపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్లలో ఇటీవల జిల్లా కలెక్టరు పర్యటించి భూసేకరణను వేగవంతం చేసేందుకు రైతులతో చర్చించారు. వారి అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో ఆదుకుంటామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ఇప్పటికే దర్శి, పొదిలి ప్రాంతాల్లో పనులు పూర్తికావస్తుండగా, కనిగిరి, పామూరు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభమయ్యాయి. జిల్లాలో భూసేకరణ పూర్తయితే త్వరలోనే మెట్టలో రైలుకూత వినపడనుంది.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)



2011-12 బడ్జెట్‌లో రూ. 2450 కోట్లతో కేంద్రం నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైనుకు పచ్చజెండా ఊపింది. 2022 కల్లా పనులు పూర్తి చేయాలని రైల్వే అధికారులు సంకల్పించారు. కొన్నేళ్లుగా భూసేకరణ సమస్య ఇందుకు అడ్డంకిగా మారింది. 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వంలో ఈ రైల్వే లైను పనులు ఊపందుకున్నాయి. 2016 ఆగస్టులో ఈ ప్రాజెక్టుకు కేంద్రం 2,289 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు వాటాను చెల్లించేందుకు అంగీకరించింది. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 202 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 150 కోట్లు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా తన వాటాను కూడా అందచేసింది. ప్రకాశం జిల్లా దర్శి పొదిలి ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తికాగా ట్రయిల్‌రన్ కూడా నిర్వహించారు. కనిగిరి, పామూరు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభమయ్యాయి. కానీ వెంకటగిరి-కనిగిరి మధ్య పనులు జరగలేదు.

సమస్యగా భూసేకరణ

జిల్లా పరిధిలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్లలో ఈ రైల్వేలైనుకు భూసేకరణ సమస్యగా మారింది. ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు, చేజర్ల, వింజమూరు మండలాల్లోని 17 గ్రామాల్లో 1159 ఎకరాలు, నెల్లూరు డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు మండలాల్లో 174.77 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. 2018లో రెవెన్యూ అధికారులు భూసేకరణ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే అప్పట్లో అధికారులు ఎకరా భూమి విలువ చాలా తక్కువగా లెక్కించారు. దాంతో రైతులు అంగీకరించలేదు. 2019లో కూడా అధికారులు మళ్లీ రైతుల అభిప్రాయాలను పరిశీలనకు తీసుకున్నారు. కానీ ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ పట్టించుకోకపోవడంతో భూసేకరణ ఆగిపోయింది.



భూసేకరణపై రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టరు ఆనంద్ (ఫైల్)

పాలకుల దృష్టి

తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ రైల్వే లైను పనులు వేగవంతంచేసే దిశగా దృష్టి సారించింది. జిల్లాలో 2200 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను ప్రభుత్వం గుర్తించింది. ఇదివరకే ఈ ప్రాంతాలో హద్దు రాళ్లు కూడా నాటారు. ఈ క్రమంలో భూసేకరణపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లా కలెక్టరు ఆనంద్ ఆత్మకూరు డివిజన్ పరిధిలోని చేజర్ల, ఆత్మకూరు మండలాల్లో పర్యటించి, రైతులతో చర్చించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అప్పారావుపాళెం రైతులు ఎకరాకు రూ. 20 లక్షల మేరకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. రైతులకు నష్టం లేకుండా మార్కెట్‌ధరను ఇప్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టరు వారికి హామీ ఇచ్చారు. భూసేకరణ పూర్తయి, సజావుగా పనులు సాగితే ఈ రైల్వే లైను వల్ల హైదరాబాద్-చెన్నై మధ్య సుమారు 90 కి.మీ దూరం తగ్గుతుంది. వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కోస్తా తీరంలో ప్రస్తుతం రైలు మార్గానికి ప్రత్యామ్నయంగా ఉపయోగపడుతుంది. అంతేకాక జిల్లాలోని ఆత్మకూరు, వెంకటగిరి, ఉదయగిరి, నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనున్నది.

విత్తనాలు, ఎరువుల కొరత రానివ్వొద్దు

కలెక్టర్ ఆనంద్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ వ్యవసాయా ధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పంట భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేపట్టాలన్నారు. రైతులకు ఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. 'ఈ-క్రాప్' నమోదు చేయాలని, పీఎం కిసాన్ పథకం కింద రైతులను రిజిస్ట్రేషన్ చేసి వారికి అవసరమైన ఇన్ పుట్ సబ్సిడీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ క్రాప్ కల్టివేషన్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని అధికారులకు నిర్దేశించారు. ఉద్యాన పంటల దిగుబడిని నిల్వ చేసుకునేం దుకు కలెక్షన్, రైపనింగ్ సెంటర్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఈ నెల 15వ తేదీ జరిగిన పాత నేరస్థుడు వాక అశోక్ హత్య కేసులో ఏ-2 నిందితుడిని చిన్నబజారు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. అశోక్ మార్కెట్ ఎదుట ఉండగా గోని రాము, పసుపులేటి సందీప్ కుమార్ అనే నిందితులు అతనితో గొడవపడ్డారు. అనంతరం అశోక్‌ను కత్తితో పొడిచారు. తీవ్ర రక్తస్రావంతో అశోక్ మృతి చెందాడు. అతని తమ్ముడు వంశీ ఫిర్యాదుతో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మంగళవారం ఉదయం బోడిగోడితోట వద్ద ఏ-2 పసుపులేటి సందీప్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై నవాబుపేట పోలీసు స్టేషన్‌లో షీటు ఉండటంతో పాటు నవాబుపేట, నెల్లూరు రూరల్, సంతపేట, చిన్నబజారు పోలీసు స్టేషన్లలో 8 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఇద్దరు బాలలు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరు బాలలను పోలీసులు అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. నెల్లూరులోని సంతపేట మార్కెట్ సెంటర్‌లో షేక్ సూరి కుటుంబం నివసిస్తోంది. ఈ నెల 13న ఆమె ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటి లోపల చూడగా బీరువాలోని వస్తువులు కన్పించకపోవడంతో 14వ తేదీ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారం గా చోరీకి పాల్పడింది ఇరగాళమ్మ గుడి, ఈద్గామిట్టకు చెందిన ఇద్దరు బాలలుగా గుర్తించారు. మంగళవారం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 630 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు ద్వారా వారిని తిరుపతిలోని హోమ్‌కు తరలించారు.

యువకుడిపై దంపతుల దాడి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాట్లాడుకుందామంటూ పిలిచి యువకుడిపై దంపతులు కత్తితో దాడిచేసిన ఘటన నెల్లూరు శివార్లలోని శ్రామిక్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరురోడ్డు న్యూఎస్‌టీబీఐ కాలనీకి యాసిర్‌కు శ్రామిక్‌నగర్‌కు చెందిన బ్రహ్మనాయుడుతో పాతకక్షలున్నాయి. ఈ నెల 21న యాసిర్ తన పుట్టిన రోజు సందర్భంగా శ్రామిక్‌నగర్‌లోని స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. అదే సమయంలో యాసిర్‌ను మాట్లాడుకుందామని బ్రహ్మనాయుడు అతని భార్య ఇంటికి పిలిచారు. యాసిర్ ఇంటికి రాగానే బ్రహ్మనాయుడు కత్తితో అతనిపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడిని అతని స్నేహితులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. మంగళవారం యాసిర్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టిబడడంతో డీబార్ చేసినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు. ఈ పరీక్షలకు 9,960 మంది విద్యార్థులకు గాను 9,269 మంది హాజరు కాగా 691 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మోసగాడి కోసం గాలింపు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని గర్భవతిని చేసి ఆ తర్వాత రహస్యంగా వివాహం చేసుకుని ఆమెకు అబార్షన్ చేయించి తప్పుకున్న మోసగాడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు, సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరులోని పొదలకూరు రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ యువతి ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమెను ప్రేమిస్తున్నానని సమీప బంధువైన చందు అనే వ్యక్తి నమ్మించాడు. దీంతో ఇద్దరూ కొంతకాలం సహజీవనం చేయడంతో ఆమె గర్భవతైంది. పెళ్లిచేసుకోమని నిలదీయడంతో చందు రహస్య వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత అబార్షన్ చేయించుకుంటే అందరి సమక్షంలో వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించాడు. గుడ్డిగా అతని మటలు నమ్మిన యువతి అబార్షన్ చేయించుకుంది. ఆ తర్వాత ఆమెను పుట్టింటికి పంపేశాడు. ఈ ఏడాది మేలో యువతి కుటుంబ సభ్యులు చందు కుటుంబంతో పెళ్లి విషయం మాట్లా డారు. ఆ తర్వాత నుంచి చందు ఆమెను దూరంగా పెడుతూవచ్చాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జూలైలో కేసు నమోదు చేశారు. ఇటీవల ఆ కేసును నాన్‌బెయిల్‌బుల్ కేసుగా ఆల్టర్ చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అనుమానాస్పదంగా యాచకుడి మృతి



సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ జన సంఘం వద్ద రోడ్డు పక్కన ముళ్లచెట్లలో గుర్తు తెలియని భిక్షగాడి మృతదేహం అనుమానాస్పదంగా పడి ఉంది. మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డు పక్కన ముళ్లపొదల్లో పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రక్తదాతలు స్ఫూర్తిప్రదాతలుగా నిలిచి పలువురికి ప్రాణదానం చేస్తున్నారని డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐ జీ గంగాధర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 115 మందిని పోలీసు అధికారులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ కోసం నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు ఉదయగిరి సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి ఆదిలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

● ఇబ్బందులు పడుతున్న అధికారులు

కలిగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దారు, మండల విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండ టంతో గదులన్నీ ఉరుస్తున్నాయి. ఈ సమస్యతో అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు తలుపులు, కిటికీలు దెబ్బతినిపోయి వర్షపునీరు లోపలికి వస్తుండటంతో రికార్డులు తడిసిపోతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం లోపల ఇలా ఉంటే వెలుపల వర్షపునీరు నిలిచి లోపలికి వచ్చేందుకు కూడా వీలులేకుండా ఉందని చెబుతున్నారు. జిల్లా అధికారులు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.




శ్లాబు పెచ్చులూడిన ఎంపీడీవో కార్యాలయం, దెబ్బతిన్న తలుపులు

క్వార్ట్జ్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం సమీపంలో వేద మైన్స్, మినరల్స్ వారికి క్వార్ట్జ్ తవ్వకాలకు ప్రభుత్వం లీజు అనుమతులు ఇచ్చింది. దీంతో మంగళవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ యాజమాన్యం ఏడాదికి 1,02,950 టన్నుల క్వార్ట్జ్ తవ్వకాలు చేపడుతుందన్నారు. ఈ విషయమై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. స్పందించిన గ్రామస్థులు తాము వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తామన్నారు. తమ గ్రామంలో అత్యధికులు మూగజీవాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ జీవాల మేతకు ఈ కొండే ఆధారమని, ఈ తరుణంలో ఆ కొండను క్వార్ట్జ్ తవ్వకాలు ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని తేల్చిచెప్పారు. స్పందించిన అధికారులు మీ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ శ్రీధర్, తహసీల్దారు నాగరాజు, ఎస్ఐ ఆదిలక్ష్మి, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్న అధికారులు

ఎస్సీ వర్గీకరణతో విభేదాలు సృష్టించడం తగదు : సాల్మన్‌రాజు

అల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను వర్గీకరించి దళితుల్లో విభేదాలు సృష్టించడం అన్యాయమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన గ్రద్దగుంటలో సంఘం సభ్యులతో నిరసన చేపట్టారు. రాజకీయ లబ్ధి కోసం అన్నతమ్ములుగా కలసిమెలసి ఉన్న మాల,మాదిగలను విభజించాలనే ఉద్దేశ్యంతో వర్గీకరణ ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభేదాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. దీనిపై త్వరలో మాల మహాగర్జనను నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మునలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, గంగపట్నం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, డక్కన్‌వీల్స్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి , డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇంటర్వ్యూలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

ఘనంగా అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి

అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం స్వాతంత్ర సమరయోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆవాజ్ కమిటీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, ఇష్తియార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలో మంగళవారం ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పనులు నిర్దేశిత కొలతల ప్రకారం చేస్తే కూలి ధర గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్ పాల్గొన్నారు. కాగా గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. ఈ మేరకు వారితో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం నల్లబోతులవారిపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సకాలంలో ఈకేవైసీ చేయించుకోకపోవడంతోపాటు సాంకేతిక సమస్యల కారణంగా పీఎం కిసాన్ నగదు జమ కాని రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వెలుగు వీవోఏలతో సమీక్ష

వింజమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో మంగళవారం వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఎం కృష్ణారావు అధ్యక్షత వహించారు. స్త్రీనిధి ఉన్నతి, సీఐఎఫ్ నిధుల రికవరీ, లోకోస్ వీపీఆర్‌పీవోఎన్‌డీ సీహెచ్‌ఓఈ ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు సుశీల, లక్ష్మీకుమారి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, అకౌంటెంట్ సువార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

వింజమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊటుకూరు సచివాలయం, వింజమూరు-2 సచివాలయాల పరిధిలో మంగళవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో ఆధార్ చేర్పులు, మార్పులు, ఫోన్ నెంబరు అనుసంధానం చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 25 వరకు శిబిరాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సూపర్‌వైజర్‌లు అబ్దుల్‌బాషా, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక హోమం

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో మంగళవారం లలితా సహస్రనామ పారాయణం ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక హోమం నిర్వహించారు.. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం

జలదంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పాలకవర్గం సమావేశం మంగళవారం గ్రామ సచివాలయం-1 భవనంలో సర్పంచ్ చలంచర్ల అనూరాధ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రూ.10లక్షలకు పైగా జరుగనున్న పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. గ్రామసచివాలయం ఆవరణలో సందర్శకుల అవసర నిమిత్తం మరుగుదొడ్ల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో తాగునీటి అవసరాల నిమిత్తం కొత్తగా బోర్ల నిర్మాణం, మరమ్మతులకు గురైన తాగునీటి పథకాల పునర్నిర్మాణం, పలుచోట్ల రచ్చబండల నిర్మాణం లాంటి పనులను ఆర్థికసంఘం, పంచాయతీ సాధారణ నిధుల నుండి వెచ్చించి అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి, వార్డుసభ్యులు, మాజీసర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటక్రిష్ణ, గ్రామ సచివాయాల సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లిలో కావలి నృత్యకారిణుల ప్రతిభ

కావలి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన నృత్యకళా ప్రదర్శనలో కావలి నృత్యకారిణిలు అద్భుత ప్రదర్శన చేసి ప్రశంసలు అందుకున్నారు. రెండురోజులుగా జరిగిన ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమంలో జరిగిన నృత్య ప్రదర్శనలో జయం కూచిపూడి నాట్యాలయం విద్యార్థినులు భావన, నిఖిత, మహిత, మాన్వి సంహిత, మేఘశ్రీ, ఆరాధ్య, శ్రీదేవిష్ణు, లోహిత్‌లు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందుకున్నారు. నాట్యాలయం గురువు జాహ్నవి, నిర్వాహకురాలు జమునలు వీరికి ప్రత్యేక అభినందలు తెలిపారు.

నేటి శిక్షణకు హాజరుకండి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ సభ్యత్వాల నమోదుపై శిక్షణ నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు మండల టీడీపీ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలన్నారు.

● పార్టీసభ్యత్వ నమోదు పై శిక్షణ

కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో బొమ్మరాజుచెరువు వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీసభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్ తెలిపారు. కార్యక్రమానికి బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతోపాటు, మండల నాయకులు హాజరు కావాలని కోరారు.

భక్తుల ఇక్కట్లు

బిట్రగుంట, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తర ముఖద్వార రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతలకు గురైంది. దీంతో మంగళవారం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రతి శనివారమే కాకుండా ప్రతి రోజు వందలాది భక్తులు దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నిబంధనల మేరకే మద్యం దుకాణాలు

● సుంకర శ్రీనివాసరావు, కావలి ఎక్సైజ్ సీఐ



కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కావలి సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం దుకాణాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని కావలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు.

? సర్కిల్‌లో ఎన్ని మద్యం దుకాణాలు కేటాయించారు. వాటిలో ఎన్ని ఏర్పాటు చేశారు?

! కావలి సర్కిల్‌లో 17మద్యం దుకాణాలు కేటాయించగా వాటిలో 15దుకాణాలను ఏర్పాటు చేశారు.

? నిబంధనల మేరకు దుకాణాల ఏర్పాటు జరిగిందా?

! ప్రస్తుతం తాత్కాలికంగా ప్రొవిజన్ లైసెన్సులు ఇచ్చాం. నిబంధనల మేరకు ఏర్పాటు చేస్తేనే నవంబరు ఒకటి నుంచి పర్మినెంట్ లైసెన్స్‌లు ఇస్తాం

? దుకాణాల ఏర్పాటు విషయంలో వ్యాపారుల మధ్య గొడవలు ఎందుకు..

! మండలంలో ఎక్కడైనా దుకాణాలు పెట్టుకునే వెసులుబాటు ఉండటంతో మంచి ప్రదేశాలు కోసం పోటీ పడి తర్వాత వారు సర్దుకుంటున్నారు.

? వ్యాపారులు కొన్ని మండలాల్లో సిండికేట్ అయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి?

! ఎక్కడా వ్యాపారులు సిండికేట్ అయినట్లు తమ దృష్టికి రాలేదు. ఎక్కడైనా సిండికేట్ అయితే వారిపై చర్యలు తీసుకుంటాం.

ఇద్దరికి గాయాలు

కలిగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు రహదారిలోని నాగిరెడ్డిపాలెం సమీపంలో మంగళవారం గొర్రెల లోడ్‌తో వింజమూరు వైపు వెళ్తున్న టాటా-ఏస్ ఆటో, కలిగిరి వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కలిగిరి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

చెక్కు అందజేత

కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని గౌరవరం షేక్ మస్తాన్‌బాషకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందినందుకు పెట్టిన ఖర్చులను ఈ నగదు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతం బాబుల్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి): డ్రా పౌవుట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో గోవిందయ్య తెలిపారు. మంగళవారం విశ్వోదయా బాలుర, బాలికోన్నత పాఠశాలలు, మున్సిపల్ హైస్కూల్ పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. హెచ్‌ఎంలతో మాట్లాడారు.

పరిమితికి మించి పొగాకు సాగు చేయొద్దు

● పొగాకుబోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సీజన్‌లో రైతులు పరిమితికి మించి పొగాకు సాగుచేసి నష్టాలు కొనితెచ్చుకోవద్దని పొగాకుబోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు రైతులకు సూచించారు. మంగళవారం కందుకూరు-2 వేలం కేంద్రంలో ఈఏడాదికి పొగాకు వేలం ప్రక్రియ ముగింపు సందర్భంగా రైతులు విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయంగా అనేక దేశాలలో ఈ ఏడాది పొగాకు సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. అనంతరం వేలం నిర్వహణా ధికారి ఎం.కిరణ్ మాట్లాడుతూ గడచిన సీజన్‌లో కందుకూరు 2వేలం కేంద్రంలో 16.32 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరగ్గా అత్యధిక ధర రూ. 360, అత్యల్ప ధర రూ.100గా నమోదై సరా సరి ధర రూ. 276.03లు దక్కిందని వివరించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి కిరణ్ , పొగాకుబోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఆర్ఎం ఎం. కృష్ణ, విశ్రాంత ఆర్ఎం గూడూరి ఉమామహేశ్వరరావు, పొగాకు బోర్డు మెంబరు బొడపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొగనారు మళ్లలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని కందుకూరు వేలం కేంద్రం కార్యనిర్వాహణాదికారి చంద్రశేఖర్ తెలిపారు. అయ్యవారిపల్లెలో మంగళవారం పొగనాట్లు, విడుపులు, అంతరసేద్యం, నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, ఎరువులు యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలని చెప్పారు. నారుమడుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన నారు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిదులు, బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు

రైతు సమస్యలు తక్షణం పరిష్కరించాలి

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రైతు సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. నియో జకవర్గంలో కొన్ని మండలాల్లో ఇద్దరు రైతులు ఒకే నెంబరుతో అసైన్‌మెంటు భూమిని కలిగిఉన్నట్లు సమస్యలు ఉన్నాయని ఈ విషయంలో నిజమైన హక్కు దారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అసైన్‌మెంటు భూముల రికార్డులు ఈనెలాఖరుకల్లా రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ అక్టోబరు 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నవంబరు 5న విజయవాడలోని ఎన్వీకే విజ్ఞానకేంద్రంలో జరిగే సభలకు సంబంధించి గోడపత్రికలను మంగళవారం విడుదల చేశారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జాన్, దాస్, సురేష్, వంశీ, మానస తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సహకరించాలి: సీఐ

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : నేరాల అదుపుకు ప్రజలు సహకరించాలని కందుకూరు సీఐ కె. వెంకటేశ్వరరావు కోరారు. కోవూరులో మంగళవారం రాత్రి విలేజ్ విజిట్‌లో ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించి వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. నేరస్తుల కదలికలు ఎక్కడ ఉన్నా తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యగా తీసుకోవాలన్నారు.

ఇంటింటి లార్వా సర్వే

ఉలవపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి సింధుప్రియ వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి మంగళవారం బద్దిపూడిలో ఇంటింటి సర్వే చేపట్టారు. నీరు నిల్వ ఉన్న తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, టైర్లుల నుంచి నీరు బయటకు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు, దోమల బెడద ఎక్కువయ్యే అవకాశాలు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంవో నీ నాగరాజు, సబ్ యూనిట్ అధికారి విజయచంద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి

ఉలవపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నుంచి కావలి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు మంగళవారం ఉలవపాడు జాతీయ రహదారి జేబీ దాబా సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వృద్ధ యాచకుడుని ఢీకొంది. తీవ్ర గాయాలైన అతన్ని 108లో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఏఓ హేమంత్‌భరత్‌కుమార్

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు మిర్చి పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పొలం పిలుస్తొంది కార్యక్ర మంలో ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ మాట్లాడారు. మిర్చి పంట నాటుకునే ముందు ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ దుక్కిలో వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు రవీంద్ర నాగరాజు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్లు దుర్భరం

● కోవూరులో ఏ వీధి చూసినా గుంతలు, బురద
● వాహనదారులు, పాదచారులకు తప్పని తిప్పలు



కోవూరు బజారుకూడలిలో ధ్వంసమై ప్రజలకు అసౌకర్యంగా మారిన సిమెంటు రహదారి

కోవూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన కోవూరు పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోవూరు-నెల్లూరు ప్రధానరోడ్డుకు పలుచోట్ల గుంతలు పడి వాహనరాకపోకలు ఇబ్బందిగా మారాయి. సుమారు 20 ఏళ్ల కిందిట నిర్మించిన సిమెంటు రోడ్లపైన ఒక లేయర్ లేచిపోయినప్పటికీ రోడ్లు భవనాల శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ఆటోలు, కార్లు, బస్సుల్లో వెళ్లే సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడడమే కాక అనారోగ్యాలకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. పట్టణంలోని బజారు కూడలి, మండబయలు కూడలిలో రోడ్లు ధ్వంసమైంది. శాంతినగర్, సొసైటీ వీధుల్లోని గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలుస్తోంది. పట్టణంలోని పీఆర్ఆర్, ఎస్ఎస్ఆర్, ఎస్‌వీఆర్, గుమ్మళ్లదిబ్బ, పాటూరు రోడ్డు, ఇనమడుగు రోడ్లు ధ్వంసమై దుస్థితిలో ఉన్నాయి. వీటితో పాటు పట్టణంలోని పలు రోడ్లు కూడా దెబ్బతిని అధ్వానంగా ఉన్నాయి. అధ్వానంపు రహదారులకు రాకపోకలు సాగించడం పట్టణ వాసులకు దుర్భరంగా మారుతోంది.



సెయింట్‌పాల్స్ పాఠశాలకు వెళ్లే రోడ్డుపై బురద

లబ్ధిదారుల ఎంపికకు సిద్ధం

● నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్



నెల్లూరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఎంపికకు సిద్ధంగా ఉన్నామని నెల్లూరురూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ వెల్లడించారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ...

? పల్లెల్లో పారిశుధ్య లేమి నివారణకు చర్యలేమిటి

! అన్నీ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై పర్యవేక్షణ జరుగుతోంది. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో మరింత జాగ్రత్తగా ఉన్నాము. కాలు వలు, రోడ్లు, నివాసాల వద్ద పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తు న్నాము. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

? వర్షాలకు తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారా

! వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాము. క్లోరినేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చేతి పంపులు మరమ్మతులకు గురైతే వెంటనే రిపేరు చేసేందుకు సామగ్రి, సి బ్బంది సిద్ధం. పంచాయతీల్లో నిధుల సమ స్య తలెత్తితే మండల పరిషత్ నుంచి వాడుకునేందుకు కూడా వెసులు బాటు కల్పిస్తున్నాము.

? ఇటీవలి భారీ వర్షాలకు సంభవించిన నష్టం ఎంత

! మండలంలో పంటలు వేయకపోవడంతో వ్యవసాయపరంగా నష్టాలేమి లేవు. ఇతర రంగాల నష్టాలు కూడా లేవు. కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమ య్యాము.

? ఉపాధి హామీ పనులపై ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నాయి

! ప్రస్తుతం ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. ఎక్కడన్నా లోపాలుంటే బయటపడిపోతాయి. బాధ్యులపై చర్యలు కూడా ఉంటాయి. దాదాపుగా అన్నీ గ్రామాల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. 60 శాతం వరకు లక్ష్యం చేరుకున్నాము.

సీపీఎం సభల్లో 24 తీర్మానాలు

● నగర కార్యదర్శి కత్తి



సమావేశంలో కత్తి శ్రీనివాసులు, నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నగర మహా సభల్లో ప్రజా సమస్యలపై 24 తీర్మానాలు చేశామని ఆ పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తెలిపారు. మహాసభలను జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సీపీఎం జిల్లా కార్యాల యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్నానదికి ఎగువ, దిగువన పొర్లుకట్ట పటిష్టతకు పోరాటం చేస్తామని చెప్పారు. నగరంలో 100 ఏళ్లకుపైగా కాలువ కట్టలపై నివాసం ఉంటున్న వారి ఇళ్లను తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. మద్యాన్ని ఏరులై పారించే చర్యలను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ బీ, సూర్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● యూటీఎఫ్ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాల యం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. సం ఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు మాట్లాడుతూ మునిసిపల్ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత అధికంగా ఉందని, అర్హులకు ఉద్యో గోన్నతి కల్పించి టీచర్ల కొరత తీర్చాలని ప్రభు త్వాన్ని కోరారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెం ట్లకు హెచ్ఎం, అర్బన్ ఎంఈవోలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జి ల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ మాట్లాడుతూ సమ స్యలను త్వరితగతిన పూర్తి చేయకుంటే డైరెక్టర్ ఆఫ్ స్కూ ల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షు డు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి ఏ మురళీధర్‌రావు, కార్యదర్శు లు నాగిరెడ్డి, సురేంద్ర బాబు, మధుసూదన్‌రావు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఏడీసీ నందన్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా వైవో నందన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న శర్మద రిలీవై మంగళగిరిలోని పురపాలక శాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లిపోయారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నందన్ కలెక్టర్ ఓ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆక్రమణల కూల్చివేత

నెల్లూరు (సిటీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 22వ డివిజన్ భక్త వత్సల నగర్‌లో రోడ్డు ఆక్రమిత కట్టడాలను సిటీ ప్లానింగ్ అధికారులు కూల్చేశారు. స్థానికుల ఫిర్యాదుతో కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు ప్రైవేట్ కూలీలతో కట్టడాలు నేలమట్టం చేశారు. రోడ్లు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేని కట్టడాలను కూల్చేస్తామని ప్రకటించారు. ప్రజలు ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా కూడా కార్పొరేషన్‌కు అందించవచ్చని తెలిపారు.

అష్ఫాఖుల్లాఖాన్ యువతకు స్ఫూర్తి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో అమరుడైన అష్ఫాఖుల్లా ఖాన్ యువతకు స్ఫూర్తి అని అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అన్నారు. మంగళవారం నగరంలోని అవాజ్ కార్యాల యంలో అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో రషీద్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్ పూర్‌కు చెందిన అష్ఫాఖుల్లా ఖాన్ మతాలకు అతీతంగా ఐకమత్యంతో అంగ్లేయులను ఎదుర్కోవాలని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, సుబ్రహ్మణ్యం, అవాజ్ నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, షేక్ రియాజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 33 మంది ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు పలు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని చెప్పారు. మొత్తం 88 మంది అభ్యర్థులు మేళాకు హాజరుకాగా 33 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, జిల్లా ఉపాధి అధికారి వినయ్ కుమార్, జేడీఎం హైమావతి, కళాశాల స్కిల్ హబ్ ఇన్‌చార్జులు డాక్టర్ శ్రీరంజని, ఏ ఉమాసుమాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ముత్తుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సస్యరక్షణతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కృష్ణపట్నంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువగా చౌడు భూములు ఉన్నందున పచ్చిరొట్ట పైర్లు వేసుకోవడంతోపాటు జిప్సం వినియోగిస్తే చౌడును నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కరీం, దేవరాజ్, రైతులు, పాల్గొన్నారు.

రబీకి అనుకూలమైన...

ఇందుకూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిపాడు, నిడుమునలి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి బి.రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రబీ సీజన్‌కి అనుకూలమైన వరి వంగడాలు బీపీటీ-5204, కేఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-15048 నాటుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీకాంత్, ఎంపీఈవో యమున, వెటర్నరీ అసిస్టెంట్ జస్వంత్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● సైదాపురం (ఆంధ్రజ్యోతి): మర్లపూడి, లింగసపాలెం గ్రామాల్లో మంగళవారం ఏవో హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది గ్రామసభలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసులు, శివనారాయణ, మదన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

27న సంకీర్తన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గణపతి సచ్చిదా నంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 27న నగరంలోని సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మీ ఆలయంలో విద్యార్థులకు సంకీర్తన, వక్తృత్వ పోటీలు జరుగుతాయని ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్యనామ సంకీర్తన పోటీలు జరుగుతాయన్నారు. 4, 5, 6, 7 తరగతుల వారికి పురాణంలో భగవంతుడు గురురూప అవతారాలు అనే అంశం పైన, 8, 9, 10 తరగతుల వారికి పురాణాలు, స్మృతుల ప్రకారం ధర్మం, భక్తి జ్ఞానం అనగా ఏమిటీ? నేటి సమాజంలో వాటి ఆవశ్యకత అనే అంశం మీద వక్తృత్వ పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రీ సర్వేలో తప్పులు సరిదిద్దుతాం



మనుబోలు : గురివిందపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

వెంకటాచలం(ఆంధ్రజ్యోతి): గతంలో చేపట్టిన భూ సర్వేలో లోపాలను సరిదిద్దేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గొలగమూడిలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విజయ్, టీడీపీ నేతలు పార్థసారధి నాయుడు, బొనిగల దామోదర్, రవినాయుడు, పొట్టేల మనోహర్, ఈదర శ్రీనివాసులు తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సుకు 38 అర్జీలు

మనుబోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురివిందపూడిలో మంగళవారం రెవెన్యూ అధికారులు రీసర్వేపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 38 మంది బాధిత రైతులు తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్యకు రీసర్వేపై అభ్యంతరాలు తెలుపుతూ అర్జీలు ఇచ్చారు. వాటిని విచారణ చేసి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దారు రైతులకు బదులి చ్చారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనువాసులు, ఆర్ఐ నారాయణ, వీఆర్ వో. ఖాదర్‌మస్తాన్, టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ, చెన్నూరు సుధీర్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో జంతుశాస్త్రం, తెలుగు విభాగాల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది పీజీ ఎంట్రన్స్‌లో అర్హత పొందిన విద్యార్థులు బుధవారం నుంచి ఈనెల 25లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు.

పొదలకూరు ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి



మనుబోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పొదలకూరు ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ మండల అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని నియమించినట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. పిడూరుపాళెంకు చెందిన రామకృష్ణారెడ్డి పదేళ్లుగా మండలాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హరనాథపురానికి చెందిన భాను విష్ణువర్ధన్, భాను సాయివర్ధన్, రెహమాన్, వేదాయపాళేనికి చెందిన తన్వీర్, నవాబుపేటకు చెందిన చారి రౌడీషీటర్లు. వీరు కొంతకాలంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. మంగళవారం ఎస్వీజీఎస్ కళాశాల వద్ద గంజాయి విక్రయిస్తుండగా బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. పోలీసుల రాకను గమనించిన భాను విష్ణువర్ధన్, తన్వీర్, చారీ పరారయ్యారు. భాను సాయివర్ధన్, రెహమాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయి, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సభ్యత్వ నమోదు సవాలే!

● కార్యకర్తల కోసం రోజుకో గంట : రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు సవాల్‌గా తీసుకుని రాష్ట్రంలో నియోజక వర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి మంగళవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదులో ప్రతీ నాయకుడు భాగస్వామి కావాలన్నారు. ఇక నుంచి తన కార్యాలయంలో రోజూ సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య కార్యకర్తల కోసమే ఉంటానని, వారి సమస్యలు, ఇబ్బందులు తనకు నేరుగా చెప్పుకోవచ్చని తెలిపారు. తనకు కార్యకర్తలే బలమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ నూరుశాతం స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్య సరస్వతి ఆలయంలో నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ

● కుర్తాళం పీఠాధిపతి రాక



సౌభాగ్య సరస్వతీ నూతన ఆలయం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధిలో పునర్నిర్మించిన సౌభాగ్య సరస్వతి అమ్మవారి ఆలయ ప్రారం భం, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయని ప్రతిష్ఠాపనాచార్యులు మాచవోలు రమేష్ శర్మ, ఆలయం మేనేజర్ మాచవోలు అనురాధ తెలిపారు. మంగళవారం ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పత్నీ సమేత నవగ్రహాలతో పాటు 19 మంది దేవతామూర్తుల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ విశేష పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి బుధవారం విచ్చేస్తారని, మధ్యాహ్నం 3 గంటలకు అయ్యప్పగుడి వద్ద స్వాగతం పలుకుతామని, భక్తులందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పత్రి గురురాజా, సాయి పొడు, రాజా శ్రీనివాసరావు, కేవీ శ్రీధర్, కే మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పాత వేదాయపాళెంలో ప్రసాద్ కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమార్తె ఈనెల 21న దుస్తులు ఇస్త్రీ చేయించుకొని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఆమె జాడ తెలియరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు భవనం పరిశీలించిన జిల్లా న్యాయాధికారి



ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి యామిని

కోవూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని జిల్లా న్యాయాధికారి యామిని మంగళవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కోర్టు భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం కష్టతరంగా ఉందని, మరొక ప్రభుత్వ కార్యాలయంలోనికి తరలించి నూతన భవనాన్ని నిర్మించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి చైతన్య కోరారు. దీంతో జల్లా న్యాయాధికారి యామిని ఇందిరా క్రాంతిపథం, స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయం, కేఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కోర్టు భవనాన్ని ఓ ప్రభుత్వ కార్యాలయానికి తరలించే అవకాశముందని తెలిసింది. ఆమె వెంట నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష, సీనియర్ సివిల్ న్యాయాధికారి చైతన్య కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

మీటర్ రీడర్లకి వేతనాలు తగ్గిస్తే ఊరుకోం : ఏఐటీయూసీ

నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో పని చేస్తున్న మీటర్ రీడర్లకి వేతనాలను తగ్గించాలని చూస్తున్నారని, అలా చేస్తే ఊరుకోమని ఏఐటీయూసీ నా యకులు హెచ్చరించారు. సీపీఐ కార్యాల యంలో మంగళవారం ఆ యూనియన్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి దామా వెంకయ్య మాట్లాడుతూ మీటర్ రీడర్లకి నగరంలో రూ.3.60 పైసలు, రూరల్‌లో రూ.3.70పైసలు చొప్పున ఇవ్వాలని విద్యుత్ సం స్థ యాజమాన్యం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. అయితే దానిని కాంట్రాక్టరు పట్టించుకోకుండా, వేతనాలను తగ్గించాలని చూస్తున్నారని ఆరోపించారు.. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పీ శంకర్, మీటర్ రీడర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్ వలీ, పీ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా ఉద్యమాలకు సీపీఎం సిద్ధం

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో ప్రజాపోరాటాలు, ఉద్యమాలకు సీపీఎం సిద్ధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మంగళవారం బుచ్చిలోని పైడ రామయ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రాంతీయ కమిటీల 3వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. . బుచ్చి నగర పంచాయతీలో తాగునీరు, పారిశుధ్యం, కార్మికుల జీతాల విషయంలో సమస్యలపై పరిష్కారానికి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, మాదాల వెంకటేశ్వర్లు, గోపాల్, ముత్యాల గుర్నాథం పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రానికి కంప్యూటర్లు, కుట్టు మిషన్ల వితరణ



వితరణ చేసిన కంప్యూటర్ల వద్ద దాతలు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రానికి దాతలు కంప్యూటర్లు, కుట్టు మిషన్లు వితరణ చేశారు. మంగళవారం రైస్ మిల్లు అధినేత మునగ వెంకటేశ్వర్లు, సింహపురి పెయిం ట్స్ అధినేత సూర్యనారాయణ, సీఎన్ఆర్ అధినేత పేర్ల సీతారామారావు రూ. 1.70 లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లను అందచేశారు. జేవీఆర్ షాపింగ్ మాల్ అధినేత, లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రగతి శ్రీనివాసులు రెండు కుట్టుమిషన్లను అందచేశారు. దివ్యాంగుల కేంద్రం సబ్ కమిటీ సభ్యుడు సోమ భక్తవత్సల రెడ్డి, స్మైల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు రాఘవరెడ్డి, దివ్యాంగుల కేంద్రం కన్వీనర్ ఎంవీ సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ కమిటీ కోశాధికారి సురేష్ కుమార్‌జైన్, కో కన్వీనర్ బలరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'సోమేపల్లి'పై రచనలకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టు, కవి, రెవెన్యూ అధికారి సోమేపల్లి వెంకటసుబ్బయ్య (విజయవాడ) వర్ధంతి సందర్భంగా ప్రత్యేక సంకలనం ప్రచురిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమేపల్లితో ఉన్న అనుబంధాలను, సందర్భాలను వ్యాసాలు, కవితలుగా చేసిన రచనలు, ఫొటోలు పంపాలని కోరారు. నవంబరు 20వలోపు 80747 79202 నెంబరుకు వాట్సప్ ద్వారా రచనలు పంపాలని విజ్ఞప్తి చేశారు.

ఇరిగేషన్ ఎస్ఈకి శుభాకాంక్షలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఎస్ దేశనాయక్‌ను మంగళవారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరిగేషన్ సర్కిల్ ప్రెసిడెంట్ రామ చంద్రయ్య, ఎస్పీ సర్కిల్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ సెక్రటరీ మార్కండేయులు, జాయింట్ సెక్రటరీ సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌బాబు, కోశాధికారి చెన్నయ్య, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిరంజీవి, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య, ఎస్పీ సర్కిల్ యూనిట్ చంద్ర, శశి, మౌలాలి, వెంగళరెడ్డి, హేమంత్ తదితరులు ఎస్ఈని సన్మానించారు.

చేదు స్మృతి చెరిగి...
భక్తి భావన పెరిగి..

● తిరుమల ఘాట్ ఏడో మైలు వద్ద భద్రాంజనేయ విగ్రహం

6

విద్యాసంస్థల ఆవరణలో టపాసుల దుకాణాలు పెట్టొద్దు

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ఆవరణలోను, ఆయా విద్యాసంస్థల ఆట మైదానాల్లోనూ టపాసుల దుకాణాలు ఏర్పాటుచేయరాదని ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో శేఖర్ చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణలో టపాసుల దుకాణాలను ఏర్పాటుచేసేందుకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా ఏర్పాటుచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.247.65 లక్షల స్కూల్ గ్రాంట్స్ విడుదల

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,219 పాఠశాలలకు కాంపోజిట్ నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.495.3 లక్షలు మంజూరు కాగా.. తొలివిడత రూ.247.65 లక్షలు విడుదలయ్యాయి. ● జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్ల (ఎంఆర్సీ)కు ఒక్కోదానికి రూ.1.3 లక్షల చొప్పున రూ.44.2 లక్షలను విడుదల చేశారు. ఎంఆర్సీల నిర్వహణకు రూ. 30 వేలు, కాంటింజెన్సీ ఖర్చులకు రూ.30వేలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌కు రూ.30వేల చొప్పున ఖర్చు చేయాలని మార్గనిర్దేశం చేశారు.

క్వార్ట్జ్, సిలికా రవాణాకు రైట్.. రైట్...



క్వార్జ్ ఖనిజం

ఇకపై ఖనిజాల రవాణా ఇలా...

అనుమతి పొందిన గనులలో, ఎండీఎల్ పొందిన ప్రదేశాలలో ఖనిజాల నిల్వలను భూగర్భ గనులశాఖ అధికారులు పరిశీలించిన తరువాతే పర్మిట్లను మంజూరు చేస్తారు. రవాణా వాహనాలన్నీ నిఘా కెమెరాల పరిరక్షణలో బయలు దేరుతాయి. రవాణా చేసే వాహనాలన్నీ జియో పర్యవేక్షణలో ఉంటాయి. ఇకపై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరికలు జారీ చేశారు. ఖనిజాల రవాణాపై అడ్డంకులు తొలగడంపై గనుల యజమానులు, వ్యాపారులు, కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గూడూరు(అర్బన్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా కొనసాగిన ఉల్లం'ఘనుల' కారణంగా నిలిచిపోయిన ఖనిజాల రవాణాకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రభుత్వ అనుమతి పొందిన గనులు, క్వారీలు, ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్)లు ప్రభుత్వ నిబంధనల లోబడి క్వార్జ్, సిలికా శాండ్ వాటి అనుబంధ ఖనిజాలను రవాణా చేసుకునేందుకు అనుమతినిస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

2019-24 కాలంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అపారంగా ఉన్న క్వార్జ్, సిలికా సాండ్ ఖనిజాలను వైసీపీ నేతలు విచ్చలవిడిగా కొల్లగొట్టారు. రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ, ప్రైవేటు భూములన యథేచ్ఛగా ధ్వంసం చేసి వేల కోట్ల విలువ చేసే ఖనిజాలను చైనా, మలేషియా, అరబ్ దేశాలకు తరలించేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడింది. అక్రమ మైనింగ్ దందాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఈ వ్యవహారాన్ని సీఐడీకి అప్పగించింది. అంతేగాక, గనుల నిర్వహణ, ఖనిజాల రవాణాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ జూలైలో చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అక్రమ మైనింగ్ పూర్తిగా అదుపులోకి రావడంతో తదుపరి చర్యలను ప్రభుత్వం మొదలు పెట్టింది. గనుల యజమానులు, ఖనిజాల డీలర్లు, కార్మికులు, వివిధ వర్గాల ప్రజల నుంచి పలు విజ్ఞాపనలు రావడంతో రవాణాకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ గనులశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఈ మేరకు ఇచ్చిన ఉత్తర్వులు ఆయా జిల్లాల్లోని భూగర్భ, గనులశాఖ కార్యాలయాలకు మంగళవారం అందాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం.. గతంలో ఎలాంటి ఉల్లంఘన (వైలేషన్స్)లను అతిక్రమించని వారికి మాత్రమే రవాణాకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. పూర్తిగా మైనింగ్ ఉల్లంఘనలు అతిక్రమించిన వారితో పాటు కొద్దిగా పాటించని వారిని కూడాన పక్కన పెట్టేసి అనుమతులు నిరాకరించారు. ఉల్లంఘనలు తీవ్రతను బట్టి ఏపీఎంఎంసీ, ఎండీఎల్ నిబంధనల ప్రకారం అక్రమార్కులపై తదుపరి చర్యలు తీసుకుంటారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న క్వార్జ్



ఎస్వీఆర్ డిస్టలరీ లోపల సీఐడీ అధికారులు

ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో సీఐడీ తనిఖీలు

- సోదాలలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు
- పరదాలు వేసి మరీ రికార్డుల పరిశీలన
- మరో రెండు రోజులు కొనసాగే అవకాశం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపం.. రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీఐడీ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. విజయవాడ నుంచి సీఐడీ డీఎస్పీ పద్మలత ఆధ్వర్యంలో సుమారు పది మంది సభ్యుల బృందం ఉదయం 11 గంటలకు డిస్టిలరీకు చేరుకుంది. వీరితోపాటు తిరుపతి సీఐడీ.. ఎక్సైజ్ అధికారులు కూడా ఉన్నారు. ఈ డిస్టిలరీస్‌ను నెల్లూరు జిల్లాకు సంబంధించి మద్యం వ్యాపారంతో సుదీర్ఘకాలంగా సంబంధాలున్న ఓ రాజకీయ ప్రముఖుడి కుటుంబం లీజుకు తీసుకుని నడుపుతున్నట్టు సమాచారం. సీఐడీ అధికారుల బృందం డిస్టిలరీ లోపలకు వెళ్లిన వెంటనే గేట్లకు పరదాలు కట్టి బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై విచారణలో భాగంగా ఈ సోదాలు చేస్తున్నారు. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. ఏయే కంపెనీలకు.. ఏయే రకాల మద్యం, ఎంత పరిమాణంలో తయారు చేశారనే వివరాలు సేకరిస్తున్నారు. ఆయా కంపెనీలకు నెలవారీ తయారు చేసిన మద్యం.. ఎంత గోదాములకు సరఫరా అయింది? వృధా అయింది ఎంత? మిగిలిన స్టాక్ ఏం చేశారనేదీ విచారిస్తున్నారు. ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లెండ్ ఎక్కడి నుంచీ తెప్పించారు? లిక్కర్ తయారీలో వాటిని ఎంత పరిమాణంలో కలిపారు? మిగిలిన స్టాక్‌ను ఏమి చేశారనేదీ ఆరా తీస్తున్నారు. డిస్టిలరీస్‌కు ఏయే మద్యం రకాల తయారీకి అనుమతులు ఉన్నాయి? వాటికి అనుగుణంగానే తయారు చేశారా? లేక ఉల్లంఘనలు జరిగాయా? అన్నది పరిశీలించారు. గత ఐదేళ్లలో మద్యం తయారీ, విక్రయాలపై రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇక, తయారైన మద్యంలో ప్రతి 1000 లీటర్లకు ఎంత వేస్టేజ్ పోతోంది? దాన్ని ఏమి చేశారు? ధ్వంసం చేశారా లేకుంటే మళ్లీ చీప్ కింద విక్రయించారా అని ప్రశ్నించారు. కంపెనీ ప్రతినిధులు చెప్పే అన్ని వివరాలను రాత పూర్వకంగా రికార్డు చేస్తున్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా వీడియోగ్రఫీ రికార్డింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. డిస్టిలరీస్‌ను గత ఐదేళ్లలో ఎవరైనా లీజుకు తీసుకున్నారా? అన్న అంశంతో పాటు నిర్వహణకు సంబంధించి రిజిస్టర్లు ఉన్నాయా అన్నది విచారిస్తున్నారు.



డిస్టలరీ గేటుకు పరదాలు కట్టి లోపల చేపట్టిన తనిఖీలు

బాటిళ్లకు వేసే సీళ్లపైనా విచారణ

మద్యం బాటిళ్ల క్యాప్‌లపై వేసే సీళ్ల ఎక్కడి నుంచి.. ఎంత తెప్పించారు? ఎన్ని బాటిళ్లకు వాడారు? సీళ్లు మిగిలి ఉంటే ఏం చేశారనే దానిపైనా విచారణ సాగిస్తున్నారు. ఈ సీళ్లను ఎక్సైజ్ ఉన్నతాధికారుల అధీనంలో వున్న వాటిని తెప్పించి వేశారా? లేకుంటే కంపెనీ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారా అన్నది ఆరా తీస్తున్నారు. మద్యానికి ఎక్సైజ్ డ్యూటీ చెల్లించారా లేదా అని కూడా రికార్డులు తనిఖీ చేస్తున్నారు. దాదాపు 12 గంటల పాటు సాగిన విచారణలో.. బాటిళ్లకు వేసిన లేబుళ్లు, మద్యం తయారీకి.. పంపిణీకి మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారని విశ్వసనీయ సమాచారం. ఈ సోదాలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని తెలిసింది.

భగ్గుమన్న రాజకీయ కక్షలు

- నాంచారమ్మపేటలో టీడీపీ కార్యకర్త హత్య
- బైక్‌ను కాల్చివేసి.. దారుణానికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు
- గ్రామంలో ఉద్రిక్తత



కాలిపోయిన బైక్ - (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన హరిప్రసాద్

చిల్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన గ్రామంలో రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నుంచి ఆ యువకుడు టీడీపీలో చేరడం.. ఎన్నికల్లో ఆ గ్రామంలో టీడీపీకి అధిక మెజారిటీ రావడంతో కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున ఆ యువకుడిని హతమార్చారు. దీంతో చిల్లకూరు మండలం నాచారమ్మపేటలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కూలి పనులు చేసుకునే పెంచలయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు హరిప్రసాద్(21). ఇతడు రాజకీయాల్లో చురుగ్గా ఉండేవాడు. వైసీపీలో ఉన్న సమయంలో.. మరో వర్గానికి చెందిన వారితో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాడు. సోమవారం రాత్రి హరిప్రసాద్‌కు వైసీపీ కార్యకర్తలకు మధ్య వివాదం చోటు చేసుకుంది. మంగళవారం వేకువన గ్రామానికి చెందిన కట్టా రామచంద్రరెడ్డి అనుచరులైన నారప రెడ్డి వెంకటకృష్ణ, కట్టా రామిరెడ్డి, జలగం రాజేష్, దువ్వూరు దిలీప్‌రెడ్డి, మన్నెమాల మల్లి, దుంపల మధు, దుంపల భానుచంద్, దుంప సాయి, దుంపల సాయికుమార్, శనగ డానియేల్, మన్నెం హర్ష, మన్నెం సురేష్‌తో మరి కొంత మంది హరిప్రసాద్ ఇంటికెళ్లి బైకును తగలబెట్టారు. సీసాల్లో పెట్రోలు పోసి నిప్పంటించి హరిప్రసాద్ ఇంట్లోకి విసిరారు. ఇంట్లో మంటలు రాగానే నిద్రపోతున్న హరిప్రసాద్, అతడి సోదరుడు కాటయ్య బయటకు వచ్చారు. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు రాడ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. గాయపడిన కాటయ్య పారిపోగా.. తీవ్రగాయాలతో హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ రమణకుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. చిల్లకూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన కాటయ్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

సహనంగా ఉన్నామే కానీ..: సోమిరెడ్డి

దళిత యువకుడు హరిప్రసాద్ హత్యకు కారణమైన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి.. ఏరియా ఆస్పత్రిలో హరిప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అధినేత, సీఎం చంద్రబాబు చెప్పినట్లు తాము సహనంగా ఉన్నామే కానీ బలహీనంగా లేమన్నారు. సీఎంగా జగన్.. రాష్ట్రంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఇప్పుడు ప్యాలెస్‌లో కూర్చొని శాంతి వచనాలు వల్లిస్తున్నారని ఆరోపించారు. తమ నాయకుడు శాంతియుతంగా ఉండమని చెప్పడంతోనే మౌనంగా ఉన్నామని, దీనిని అలుసుగా తీసుకుని వైసీపీ నాయకులు బరితెగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. హరిప్రసాద్ హత్యకు బాధ్యులైన వారికి చట్టబద్ధంగా శిక్షపడేలా చూస్తామన్నారు. అతడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆర్థిక సాయం అదించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన కాటయ్యను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ తానంకి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు: ఎమ్మెల్యే

అంతకుముందు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడారు. రాజకీయ కక్షలను టీడీపీ ప్రోత్సహించడం లేదన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత తగాదాల్లోకి దళితులను లాగడం మంచిపద్ధతికాదన్నారు. తమ పార్టీ కార్యకర్త హరిప్రసాద్‌ను వైసీపీకి చెందిన వారు హత్య చేయడం దారుణమన్నారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, వాటంబేడు శివకుమార్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యేలు చంద్రమోహన్ రెడ్డి, రామకృష్ణ, సునీల్‌కుమార్, విజయశ్రీ

తెల్లారేసరికి మద్యం షాపులు



మంగళవారం ఉదయం 6.30కే దేవేంద్ర థియేటర్ రోడ్డులో మద్యం అమ్మకాలు



ఉదయం 9 గంటలకు తిలక్‌రోడ్డులో తెరచి ఉంచిన మద్యం షాపు

ప్రతిరోజూ ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు మద్యం షాపులు తెరవాలి. కానీ, తిరుపతిలో కొన్నింటిని ఉదయం ఆరున్నరకే తెరుస్తున్నారు. ఆ సమయానికే కొందరు మందుబాబులు వెళ్లి కొంటున్నారు. ప్రధానంగా తిరుపతిలోని దేవేంద్ర థియేటర్ రోడ్డు, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, బాలాజీ కాలనీ, వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, మంగళం రోడ్డు, డీబీఆర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల రాత్రి 12 గంటలైనా మూతపడని పరిస్థితి నెలకొంది. సమయ పాలన పాటించకున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



సీఎం చంద్రబాబుతో ఐఐటీ అధికారులు

ఏపీ డ్రోన్ టెక్నాలజీ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, డ్రోన్ టెక్నాలజీ పార్టనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి ఐఐటీతో మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు, ఐఐటీ అధికారులు విజయవాడలో పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. తిరుపతి ఐఐటీ ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్ సపోర్టు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం వంటి కీలక రంగాల్లో సాంకేతిక అభివృద్ధిపై దృష్టి పెడుతోంది. తిరుపతి ఐఐటీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలను నడపడానికి, పరిశ్రమలను బలోపేతం చేయడానికి, ఈ ప్రాంతంలో సాంకేతిక పురోగతులు, ఆవిష్కరణలు పెంపొందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. విజయవాడలో మంగళవారం జరిగిన డ్రోన్ కాన్ఫరెన్సులో ఐఐటీ తిరుపతి నుంచి సుమారు 15మంది విద్యార్థులు, 8మంది అధ్యాపకులు హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ప్రాజెక్టు టైటిల్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నెట్‌వర్క్‌ను పునరుద్ధరించడానికి ఏరియల్ బేస్ స్టేషన్ అవసరమని ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు.



ఆటోలో వెళ్తూ అల్పాహారం తింటున్న యువతులు

కోల్‌కత్తా మెట్రోరైళ్లలో సాయంత్రం పూట మహిళా ఉద్యోగులు కూరగాయలు తరుక్కుంటూ కనిపిస్తారని చెప్పుకునేవాళ్లు. ఇప్పుడా దృశ్యం కోసం అక్కడి దాకా అవసరం లేదు. సెజ్ పరిశ్రమల్లో పనులకు వెళ్తున్న ఆడవాళ్లందరిదీ ఇదే పరిస్థితి. నిద్రలేచి నింపాదిగా పనులకు వెళ్లడానికి వీళ్లు మగమహారాజులు కాదు కదా పాపం! ఇంటెడు పనీ పూర్తిచేసుకుని టిఫిను డబ్బా చేతబట్టుకుని ప్యాసింజరు ఆటో ఎక్కేయాలి. టైంకి చేరుకోవాలి. ఆ నాలుగు మెతుకులూ తినే సమయం.. ఇదిగో ఇలా ప్రయాణంలోనే. ఇది జాతీయ రహదారిపై సూళ్లూరుపేట-తడ మధ్య రోజూ కనిపించే ఉదయపు దృశ్యం.

- తడ, ఆంధ్రజ్యోతి

రెడ్ లైటు.. రైట్ రైట్

రెడ్ లైటు పడింది. పోలీసు వాహనం మాత్రం ముందుకే ఉరికింది. పోలీసులే 'సిగ్నల్'ను పట్టించుకోకుంటే, మనదేముందిలే అనుకున్నారేమో. ఆ వెనకే ద్విచక్ర వాహనదారులూ రయ్‌మంటూ వెళ్లారు. పక్కనుంచి వాహనాలు వస్తున్నా వీరు రోడ్డు దాటారు. దీంతో పక్క మార్గంలోని వాహనాలు రోడ్డుపైనే నిలిచి.. మరింత ట్రాఫిక్ సమస్యకు దారి తీసింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్లో చోటు చేసుకుంది. ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాల్సిన పోలీసులే.. ఇలా ఉల్లంఘనకు పాల్పడటం ఏమిటని వాహనదారులు విస్తుపోయారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి





అలిపిరి నుంచి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని తిరుమల క్షేత్రానికి కాలినడకన చేరుకోవాలంటే 3,550 మెట్లు ఎక్కాల్సిందే. గోవింద నామస్మరణ చేసుకుంటూ, చెమటలు తుడుచుకుంటూ, కష్టాన్ని మర్చిపోయేలా స్వామి రూపాన్ని తలచుకుంటూ అడుగులేస్తున్న భక్తులకు ఏడో మైలురాయి వద్ద నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం తారసపడుతుంది. తిరుమల దగ్గరకు చేరుకుంటున్నామనే భావనా కలుగుతుంది. నడక మార్గంలో భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు వెనుక ఆసక్తికర పరిణామమే ఉంది.

1979లో ఏమైందంటే..

1990 వరకు దట్టమైన అడవి మధ్యలోనే తిరుమల క్షేత్రం ఉండేది. అలిపిరి కాలినడక మార్గంలో 1970 వరకు రోజుకు 400 నుంచి 500 మంది భక్తులు రావడమే ఎక్కువ. 1979లో ఏడోమైలు రాయి వద్ద ఓ మహిళ హత్య అప్పట్లో కలకలం సృష్టించింది. హత్య వివరాలు స్పష్టం కానప్పటికీ కాలినడక భక్తులను ఈ ఘటన ఆందోళనకు గురిచేసింది. అప్పటి టీటీడీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి నేరాలకు ఆస్కారముందని గ్రహించారు. దీంతో ఈ మార్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వయంగా నడిచి లోటుపాట్లను గుర్తించారు. ఎగుడుదిగుడుగా ఉన్న రాళ్లను సరి చేయించారు. తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. లైటింగ్ పెంచుతూ అక్కడక్కడ దుకాణాలు ఏర్పాటు చేయించారు. గోవిందనామస్మరణను గుర్తుచేసేలా బోర్డులు పెట్టించారు. నడకభక్తులకు లగేజి భారం తగ్గించేలా చూశారు. లగేజీ ఉచిత సరఫరా, షైకప్పు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులకు నాటి ఘటన కారణమైంది. ఫలితంగా ఏడాది వ్యవధిలోనే కాలినడక భక్తుల సంఖ్య నాలుగైదువేలకు పెరిగింది. అయినప్పటికీ ఏడో మైలు రాయి హత్యోదంతం పీవీఆర్కే ప్రసాద్ మదిని తొలుస్తూనే ఉండేది.

చేదు స్మృతి చెరిగి... భక్తి భావన పెరిగి..

● భద్రాంజనేయ విగ్రహం ఏర్పాటు నేపథ్యం

పెద్దాపురం శిల్పి సాయంతో...

ఈ క్రమంలో ప్రసాద్ తన సతీమణి గోపిక సొంతూరు కాకినాడ వెళుతున్న క్రమంలో పెద్దాపురంలో 12 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూశారు. వెంటనే కారు ఆపించి భక్తివెలుగులు మూర్తీభవిస్తున్న ఇలాంటి విగ్రహాన్ని తిరుపతిలోనూ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. పెద్దాపురం సమీపాన ఓ గ్రామంలో ఉన్న ఈ విగ్రహ శిల్పి తోగు లక్ష్మణస్వామితో మాట్లాడారు. తొలుత తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేషన్ భవనం(హుజూర్ ఆఫీస్) ముందు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తరువాత అలిపిరిలో గరుత్మంతుడి విగ్రహాన్ని కూడా అద్భుతంగా ఏర్పాటు చేయించారు. ఇన్ని చేస్తున్నా అలిపిరి ఏడోమైలు వద్ద హత్యఘటన, వేదన పీవీఆర్కే ప్రసాద్‌ను వీడలేదు. ఈ క్రమంలో ఆయనకు ఓ పరిష్కార ఆలోచన వచ్చింది. దాని ఫలితమే భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు. అదే శిల్పి ఆధ్వర్యంలో 1980లో ఏడోమైలు వద్ద పది అడుగుల పీఠంతో సహా 40 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని నిర్మింపజేశారు. ఇప్పుడు అక్కడ అంజనీపుత్రుడి విగ్రహం చూడగానే భక్తులకు నిండైన భక్తి భావన స్ఫురిస్తుంది. విగ్రహ శిలాఫలకంపై 'శిల్పాచార్య తోగు లక్ష్మణస్వామి' అనే పేరు నేటికీ కనిపిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

భీష్మయ్య నాయుడికి కన్నీటి వీడ్కోలు

- శేషాపురంలో ముగిసిన అంత్యక్రియలు
- పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల నివాళులు



భీష్మయ్యనాయుడుకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శేషాపురంలో మంగళవారం సాయంత్రం టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్యనాయుడికి అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆయన మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం ఉదయాన్నే స్వగ్రామమైన శేషాపురానికి తీసుకొచ్చారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక పబ్లిషర్ శేషగిరిరావు, భీష్మయ్యనాయుడు బావమరిది, హైదరాబాదులోని కిమ్స్‌లో సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, టీడీపీ నేతలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌రెడ్డి, బడి సుధాయాదవ్, ఆర్సీ మునికృష్ణ, బీజేపీ నాయకులు సుబ్రమణ్యంయాదవ్, నరేష్‌కుమార్‌నాయుడు, వైసీపీ నేత ఎంఆర్సీ రెడ్డి, టీటీడీ విశ్రాంత జేఈవో శ్రీనివాసరాజు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీఈవో వాసుదేవనాయుడు, మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, మంచు కృష్ణ, నారాయణ విద్యాసంస్థల జీఎం కొండలరావు, సినీనటుడు రఘుబాబు తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల మెడికల్ ఆఫీసర్‌గా, నారావారిపల్లె సీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా, టీటీడీ హెల్త్ ఆఫీసరుగా భీష్మయ్య నాయుడు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సాయంత్రం గ్రామస్తులు, అభిమానులు, బంధువులు, రాజకీయ నాయకుల కన్నీటి వీడ్కోలు నడుమ అంత్యక్రియలు జరిగాయి.

ఫోనులో సీఎం చంద్రబాబు పరామర్శ

సీఎం నారా చంద్రబాబునాయుడు ఫోను చేసి భీష్మయ్య నాయుడు కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. భీష్మయ్యనాయుడు మృతికి సంతాపం తెలియజేసారు. టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం కూడా ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.





భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గల్లా అరుణకుమారి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి - భీష్మయ్యనాయుడు భౌతికకాయాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న దృశ్యం

తిరుపతి ఐఐటీకి నీటి సంరక్షణ అవార్డు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ వ్యవస్థలో 2023 నేషనల్ వాటర్ అవార్డులలో తిరుపతి ఐఐటీ ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్ చేతుల మీదుగా మంగళవారం న్యూఢిల్లీలో 5వ జాతీయ జల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి చేతుల మీదుగా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. తమ క్యాంపస్‌లో ఆదర్శవంతమైన నీటి సంరక్షణ వ్యవస్థను అమలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు అందజేసిందని సత్యనారాయణ తెలిపారు.



హీరో పరిశ్రమను సందర్శించిన కమిటీ సభ్యులు

పరిశ్రమలను పరిశీలించిన భద్రతా కమిటీ

సత్యవేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం సత్యవేడు, శ్రీసిటీలో పలు పరిశ్రమలను తనిఖీ చేసింది. కమిటీ చైర్‌పర్సన్ వసుధమిశ్రా నేతృత్వంలో సుమారు 15 మంది సభ్యులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. మాదనపాళెంలోని హీరో మోటో కార్ప్, వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరులోని అపోలో టైర్స్‌తో పాటు శ్రీసిటీలోని పలు పరిశ్రమలను తనిఖీ చేసి వివరాలను సేకరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హీరో పరిశ్రమలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ పలు సూచనలు చేసింది. జిల్లా.. సత్యవేడు అగ్నిమాపక శాఖ అధికారులు రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయండి



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్‌ఏఐ పీడీలు, జిల్లా రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. కడప-రేణిగుంట, రేణిగుంట-నాయుడుపేట, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుంచి రేణిగుంట వరకు) ఆరు లేన్ల రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులూ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణలో సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించాలని సూచించారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో నాయుడుపేట-తూర్పు కనుపూరు ఆరులేన్ల రహదారి 35.కి.మీ. చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు నాలుగు లేన్ల రహదారి, తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం సౌత్‌గేట్ ఆరు లేన్ల రహదారి 36.కి.మీ., తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్టు రోడ్డు పొడగింపునకు 6లేన్ల రహదారి 16కిలోమీటర్ల పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేప్రాజెక్టు భూసేకరణ కూడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఐఐటీ, ఐసర్‌లో పెండింగ్ భూసేకరణ పూర్తిచేయాలన్నారు. విమానాశ్రయం వద్ద జాతీయ రహదారి పెండింగ్ పనులను వచ్చే నెల 10నాటికి పూర్తిచేస్తామని, రేణిగుంట-నాయుడుపేట రోడ్డును చివరి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. జేసీ శుభం భన్సల్, గుడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు, జిల్లా సర్వేయర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 362 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- రూ. 3.55 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగలు, నిందితుడిని మీడియాకు చూపి వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీఎస్పీ రమణకుమార్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి భార్యా పిల్లలను అదుపులోకి తీసుకున్నా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో సీఐ చిన్నగోవిందుతో కలిసి క్రైం డీఎస్పీ రమణకుమార్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన శెట్టి మణి, శెట్టి సూర్య అన్నదమ్ములు. కొన్నేళ్ల కిందట హైదరాబాదుకు వలస వెళ్లిన వీరు అక్కడి ఎల్బీనగర్ సమీపంలోని శ్రీనివాస కాలనీ, శివనగర్‌లో వేర్వేరుగా కాపురమున్నారు. సులభ సంపాదన.. జల్సాల కోసం వీరు పదేళ్ల కిందట దొంగతనాలకు అలవాటుపడ్డారు. భార్య, బిడ్డలతో కలిసి ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తారు. భిక్షాటన చేస్తున్నట్లు వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్టుమెంట్లను గుర్తిస్తారు. రాత్రిళ్లు తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడతారు. కాగా, గత నెల 20వ తేదీన ఓటేరు, శ్రీనివాసపురంలోని సురేష్, వెంకట్రాజు, సురేష్ ఇళ్లల్లో భారీ చోరీ జరిగింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ చిన్నగోవిందు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ షేక్ షావలి, క్రైం పార్టీ ఏఎస్‌ఐ రాఘవ, హెడ్ కానిస్టేబుళ్లు వాసుదేవరావు, రవిప్రకాష్, కానిస్టేబుళ్లు భోజనాద్రి, ప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, ఆరీఫ్, మునిని ప్రత్యేక బృందాలుగా నియమించారు.

చోరీ కేసులను ఛేదించింది ఇలా..

ఈ తరహా చోరీలు ఎక్కడెక్కడ జరిగాయి? వాటిల్లో నిందితులు ఎవరనే కోణంలో విచారించారు. దీంతో ప్రకాశం జిల్లా కందుకూరు, రావులపాలెం, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తరహా దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. ఈ నిందితుల ఫొటోలు, మొబైల్ నెంబర్లు సేకరించారు. వీరి కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి రూరల్ రామాంజుపల్లి చెక్‌పోస్టు వద్ద కాపు కాచి ఇద్దరు నిందితులతో పాటు వారి భార్యా, పిల్లలు మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10.31 లక్షల విలువ చేసే 362 గ్రాముల బంగారు నగలు, రూ.3.55లక్షల నగదు, దొంగతనాలకు వినియోగిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శెట్టి మణి, శెట్టి సూర్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన కుటుంబ సభ్యులను తహసీల్దార్ ఎదుట హాజరపరచి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందచేస్తారని డీఎస్పీ చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయండి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని సదరన్ డిస్కం చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్, ఈఈలు రవికుమార్, వాసవీలత, బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు డివిజన్ అధికారులతో వీరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థల్లో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని వారు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా 200 యూనిట్లు దాటిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్రస్థాయిలో ఏఈలు నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ కేంద్రాల్లో ఈఈలు వి.చంద్రశేఖర్‌రావు, ఎన్.వాసురెడ్డితో పాటు రెండు డివిజన్ల డీఈఈలు, ఏఈలు, ఏపవోలు పాల్గొన్నారు.

ఆక్సిలెంట్ ఫార్మాకు హెల్త్ కెనడా అవార్డు

శ్రీసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమకు హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (సీజీఎంపీఎస్) సర్టిఫికెట్ దక్కింది. కంపెనీ నాన్ స్టెరైల్ సదుపాయం కోసం ఈ గుర్తింపు అందుకుంది. సెప్టెంబర్ 16-20 తేదీల్లో ఈ సంస్థ పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది. ఈ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉందని పరిశ్రమ చైర్మన్ జితేష్ దేవేంద్ర తెలిపారు. తమ పరిశ్రమలో నాన్-స్టెరైల్ సదుపాయంలోని ఓరల్ సాలిడ్, ఓరల్ లిక్విడ్, సెమి సాలిడ్ ఉత్పత్తులకు సంబంధించి ఈ తనిఖీలు జరిగినట్లు ఆయన వివరించారు. కాగా, హెల్త్ కెనడా సీజీఎంసీఎస్ అనేది ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ, ఆహార ఉత్పత్తులకు సంబంధించి భద్రత, నాణ్యత మార్గదర్శకాలను రూపొందించే సంస్థ.



పంచాయతీలు స్థానికంగా నిధులు సమకూర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

డక్కిలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో స్థానికంగా నిధులు సమకూర్చుకోవాలని గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో శానిటేషన్, క్లోరినేషన్, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా నిధులను స్థానికంగానే సమకూర్చుకొనేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చేపల పెంపకానికి వేలం పాటలు సకాలంలో నిర్వహించి పంచాయితీల ఆదాయ మార్గాలను పెంచాలన్నారు. ఇంటి పన్నులు, లైసెన్సు ఫీజుల వసూళ్లలో నిర్లక్ష్యంతో వహిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటురోగాల బారిన పసడకుండా పారిశుధ్య పనులు మెరుగు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లాభక్షు, రీసోర్స్ పర్సన్ రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



విజయభాస్కర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించే సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే ఉందని టీడీపీ సీనియర్ నేత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, అభిమానుల నడుమ భారీ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు కట్ట రమణారెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, షైలారి రాజశేఖర్, గాలి రాజేష్ నాయుడు, జీవీఆర్ నాయుడు, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సుధీర్, కరీముల్లా, గంగాప్రసాద్, శేషం మునిగోపి, అన్నమనేని సాయినాయుడు, నానాబాల సుబ్బారావు, చిందేటి సుజాత, సుబ్బారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 278 ఎంపిక

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జ్యోతి ప్రారంభించారు. శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు పారిశ్రామిక వాడల్లోని 25 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 642 మంది హాజరు కాగా, 278మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు.

న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది ధర్మాప్రసాద్‌పై ఎస్‌ఐ బ్రహ్మానాయుడు దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు విధులు కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈనెల 18న ఓ కేసు విషయమై మాట్లాడుతుండగా న్యాయవాది ధర్మాప్రసాద్‌తో ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా బలవతంగా కానిస్టేబుళ్ల చేత బయటకు పంపించడం సమంజసం కాదన్నారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు జలంధర్ రెడ్డి, గణపతి, శ్రీరాముల యాదవ్, పీఎస్‌ఆర్‌వీ ప్రసాద్, విజయమ్మ పాల్గొన్నారు.

డీఎస్పీకి న్యాయవాదుల ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ చెంచుబాబుకు బార్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ సభ్యుడు ధర్మాప్రసాద్ పట్ల సూళ్లూరుపేట ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

తడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం తడ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తడ, కారూరు, రామాపురం సచివాలయాల్లో నాలుగు రోజులపాటు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు యువకుడికి గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొణ్ణబంట్టు వద్ద ఆర్టీసీ బస్సు, మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మంగళవారం సూళ్లూరుపేట నుంచి మంగా నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సూళ్లూరుపేట పాలవల్లీవారి వీధికి చెందిన సోనూకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిలో నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఎంపీడీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్ బుధవారం ప్రారంభిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

దళిత మహిళపై వైసీపీ కార్యకర్త దాడి

అట్రాసిటీ కేసు నమోదు

పెళ్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులో దళిత మహిళపై వైసీపీ కార్యకర్త దాడి చేసిన ఘటనపై మంగళవారం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చిల్లకూరు దళితవాడకు చెందిన గీత రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నాగార్జున ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కామిరెడ్డి ఇంటిపై దాడి కేసు దర్యాప్తు

పెళ్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులో ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై దాడికి యత్నం, ఇంటి గేటుకు తాళాలు వేసిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు చిల్లకూరుకు చేరుకుని సత్యనారాయణరెడ్డి నివాసంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి గేటుకు తాళాలు వేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీఐ ఇరువర్గాలపై నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించారు.

దుకాణాల్లో తనిఖీలు

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోట పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ తనిఖీలు చేశారు.

ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు!

- మూడో వంతు వీఆర్వో పోస్టులు ఖాళీ
- ప్రజలకు సకాలంలో అందని రెవెన్యూ సేవలు



తహసీల్దారు కార్యాలయం

గూడూరు(అర్బన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాజీవన వ్యవస్థలో కీలకమైన రెవెన్యూశాఖలో నెలల తరబడి వీఆర్వోల ఖాళీలు భర్తీ కాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ధృవీకరణ పత్రాలు మొదలు భూముల వివరాల నమోదు వరకు ప్రజలకు అవసరమయ్యే వివిధ కార్యకలాపాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు కీలకం కాగా, చాలా స్థానాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. సాధారణ స్థానంతో పాటు రెవెన్యూ కార్యదర్శులకు పనిఒత్తిడి పెరగడంతో పాటు ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండి వారి అవసరాలు తీర్చలేకున్నారు. మండలంలో మొత్తం 39 కార్యదర్శులు ఉండాల్సి ఉండగా, నాలుగవ వంతుకు పైగా లేరు. గ్రామీణంలో 18మందికి బదులు 13మంది ఉన్నారు. ఐదుగురు వీఆర్వోల లోటు ఉంది. అలాగే పట్టణంలో 21 వార్డు సచివాలయాలకు ఆరుగురు లేరు. 15మంది మాత్రమే నెట్టుకొస్తున్నారు. గ్రామంలో ఖాళీగా ఉన్న విందూరుకు కొమ్మనేటూరు వీఆర్వో, పాలిచర్లకు పోటుపాళెం వీఆర్వో, కొండాగుంటకు దివిపాలెం 1 వీఆర్వో, నెల్లటూరుకు చెన్నూరు బిట్ 2 వీఆర్వో, మేకనూరుకు అయ్యవారిపాళెం వీఆర్వో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలో సాధుపేట, ఇందిరానగర్, మాళవ్యానగర్‌లోని రెండు వార్డులకు ఒక్కొక్క సచివాలయ రెవెన్యూ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. సత్రపువీధి సచివాలయానికి మెప్మా బిల్డింగ్, అశోక్‌నగర్‌కు సీవీసీ పార్కు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. కీలకమైన వీఆర్వోల కొరత ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి పూర్తి స్థాయిలో వీఆర్వోల నియామకాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

గూడూరు మండలంలో 11మంది వీఆర్వోల కొరత ఉంది. ఇన్‌చార్జిలతో సర్దుబాటు చేశాం. ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. వచ్చే సాధారణ బదిలీల్లో ఖాళీలు భర్తీ అవుతాయని ఆశిస్తున్నా.

– కె.చంద్రశేఖర్, తహసీల్దారు

ఎమ్మెల్యే విజయశ్రీకి టీడీపీ నేతల శుభాకాంక్షలు



విజయశ్రీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట/పెళ్లకూరు/సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్ కుమార్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. వారితో పాటు నెలవల రాజేష్, ఎస్.పార్థసారథి, ఏ.రమేష్, ఏజీ కిషోర్ ఉన్నారు. ● నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేత కట్ట రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, ఆర్యవైశ్యసంఘ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్, సన్నారెడ్డి చంద్రారెడ్డి, షైలారి రాజశేఖర్, గాలి రాజేష్ నాయుడు, జీవీఆర్ నాయుడు, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సుధీర్, కరీముల్లా, గంగాప్రసాద్, మునిగోపి, సాయి నాయుడు తదితరులు ఎమ్మెల్యే విజయశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ● ఎమ్మెల్యే విజయశ్రీకి పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు నంచి కృష్ణయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దామెర ప్రసాద్ నాయుడు, శేఖర్ నాయుడు, రాజారెడ్డి, సిద్దు లయ్య నాయుడు, నరేంద్ర యాదవ్, వెంపళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, కాటూరు గోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

చిట్టమూరు/ కోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని యల్లసిరిలో రూ.5లక్షలు, యాకసిరిలో రూ.5 లక్షలు, కోగిలి పంచాయతీలోని వడ్డికండ్రిగలో రూ.5లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, టీడీపీ నాయకులు కామిరెడ్డి సునీల్‌రెడ్డి, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణారెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, చిన్నారావు, అనురాధ, గుండుబోయిన కస్తూరయ్య, రషీద్, మోహన్‌రెడ్డి, అంకయ్య, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● కోట మండల పరిధిలోని గూడలి పంచా యతీ చంద్రశేఖరపురం మసీదు వీధిలో రూ.4.8 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి టీడీపీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్‌బాషా భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు మణియాదవ్, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, సత్తార్ పాల్గొన్నారు.

అధిక మోతాదులో ఎరువుల వాడకం అనర్థం

ఓజిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం నెమళ్లపూడి, మనవాలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన చేశారు. పంటల సాగులో మెలకువలు, ఎరువులు, పురుగు మందుల వాడకం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో గల మైక్రో టవర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని ఎంఈవో మస్తానయ్య మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కందాటి దశరధరామిరెడ్డికి డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అనాలసిస్ ఆఫ్ ఫెరేటెడ్ లేర్నింగ్ అనే అంశంపై దశరధరామిరెడ్డి పరిశోధనలు చేసి వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పంపగా డాక్టరేట్ ప్రదానం చేశారు. మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డులు, మెమెంటోలతో దశరధరామిరెడ్డిని అభినందించారు.

మేలైన పంట ఉత్పత్తుల సాధించేందుకు కృషి

వాకాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతాంగం మేలైన పంట ఉత్పత్తులు సాధించేందుకు కృషి చేస్తామని వ్యవసాయ శాఖ అధికారిణి దీప అన్నారు. మంగళవారం మండలంలోని దుగరాజపట్నంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడి, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తమ పంట ఉత్పత్తుల్లో మేలైన దిగుబడి వచ్చేలా శాస్త్రవేత్తల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మేనకూరు సెజ్‌లోని ఓ ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తున్న హరిశర్మ బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిశర్మను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.